www.hamsakalam.com PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA


చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

TELANGANA RISING CURE - PURE - RARE

EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:36 MONDAY , JUNE 15, 2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 36 సోమవారం 15 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-





## గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**రూ.46 లక్షలతో నూతన భవనం ప్రారంభం..**
**బజార్‌హత్నూర్ రూ.39 లక్షల భవనానికి శంకుస్థాపన**
**మంత్రి జూపల్లి**

హంస కలం వార్త

జ్ఞాన సముపార్జనలో గ్రంథాలయాల పాత్ర కీలకమని, విద్యార్థులు, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. శనివారం జిల్లాలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ ఆవరణలో రూ.46 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన మొదటి అంతస్తు భవనాన్ని మంత్రి ప్రారంభించారు.అలాగే బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో రూ.39 లక్షల - మిగతా2లో

# వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

హంస కలం వార్త :



వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రకృతి విపత్తులపై సమన్వయంగా పనిచేయాలని ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో వర్షాలు, ప్రకృతి విపత్తులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో వర్షాకాల పరిస్థితులు, వరద ముప్పు, పట్టణాలు, గ్రామాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్ అండ్ బీ, జలమండలి వంటి విభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొని తమ శాఖల - మిగతా2లో

## సింగరేణి కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతున్నారు



హంస కలం వార్త :బొగ్గు నిల్వలు మాయమైనట్లుగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో శ్రీరాంపూర్ ఓసీపీ వద్ద సింగరేణి అధికారులతో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. సింగరేణి కార్మికుడి శ్రమ, చెమటని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు మాట్లాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సింగరేణిపై చేస్తున్న ఆరోపణలతో తన మనసు కలచి వేసిందని.. అందుకే అధికారులతో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు. -మిగతా2లో



## భారతీయ నావికుల మృతి

**ఈ బలహీన ప్రధాని దేశాన్ని కాపాడలేరంటూ రాహుల్ గాంధీ ఫైర్**

- **హార్మూజ్ జలసంధిలో భారత నావికుల మృతిపై మోదీ సర్కార్‌ను నిలదీసిన రాహుల్ గాంధీ**
- **అమెరికాకు ప్రభుత్వం దాసోహం అంటోందని తీవ్ర విమర్శలు**
- **భారతీయుల మృతి పట్ల అమెరికాలో పశ్చాత్తాపం లేదని ఆవేదన**
- **ఈ ఘటనపై అమెరికా బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్**

హంస కలం వార్త : హార్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభు త్వంపై తీవ్ర స్థాయిలో విమ ర్శలు గుప్పించారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాకు ఒక నమ్మకమైన సేవ కు ఓడిలా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపిం చారు. ఈ ఘటనపై రాహుల్ -మిగతా2లో

## మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడించింది రేవంత్ రెడ్డే



- **మీనాక్షి నటరాజన్‌పై రేవంత్ కుట్ర అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు**
- **ఆమెకు రాజ్యసభ సీటు రాకుండా బీజేపీతో రేవంత్ కుమ్మక్కయ్యారని ఆరోపణ**
- **కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శలు**
- **ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని జోస్యం**
- **ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు**

హంస కలం వార్త : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేత, రాహుల్ గాంధీకి సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని, ఆమెపై తప్పుడు కేసు బనాయించి వేధించారని విమర్శించారు. 2

## నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం



**నేటినుంచి విద్యార్థుల కోసం కొత్త పథకం.. పుస్తకాలు,రాగిజావ పంపిణీ ప్రారంభం**

హంస కలం వార్త :సుదీర్ఘ వేసవి విరామానికి తెరపడింది. సరికొత్త ఆశలు, ఆశయాలతో తెలంగాణ వ్యాప్తంగా సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దాదాపు 50 రోజుల -మిగతా2లో

## ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేసిన విజయ్ దేవరకొండ



- **సొంతూరుకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న హీరో విజయ్ దేవరకొండ**
- **విజయ్ దేవరకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ**
- **కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక మందన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ**
- **తెలంగాణ వ్యాప్తంగా విస్తరించడమే తన కల అని చెప్పిన విజయ్**

హంస కలం వార్త : ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ తన సొంతూరికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన 'ది దేవరకొండ ఫౌండేషన్' ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డివిజన్‌లోని 45 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 180 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ 2లో

## ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన

**మేక్రాన్‌తో కలిసి చారిత్రక 'విల్లా కెర్లియోస్' సందర్శన**

- **ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ**
- **'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మోదీ, మేక్రాన్**
- **దేశంలో స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరిస్తుందన్న మోదీ**
- **ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్న నేతలు**



హంస కలం వార్త :ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు తేలికపాటి సంభాషణలో -మిగతా2లో

# గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**-మొదటిపేజీ తరువాయి:** జ్ఞాన సముపార్జనలో గ్రంథాలయాల పాత్ర కీలకమని, విద్యార్థులు, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. శనివారం జిల్లాలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ ఆవరణలో రూ.46 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన మొదటి అంతస్తు భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో రూ.39 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రంథాలయ భవనంలోని సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రంథాలయాలు సమాజానికి జ్ఞాన కేంద్రాలుగా నిలుస్తాయని, ప్రజల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు, గ్రంథాలయ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ అధికారులు, ప్రజాప్రతి నిధులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

# నేటినుంచి పాఠశాలలు ప్రారంభం

**-మొదటిపేజీ తరువాయి:** విద్యార్థుల రాకతో ఇన్నాళ్లూ నిశ్శబ్దంగా ఉన్న స్కూల్ ఆవరణలన్నీ మళ్లీ పిల్లల సందడితో కోలాహలంగా మారనున్నాయి. కొత్త విద్యా సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలు ఇప్పటికే తరగతి గదులను శుభ్రం చేయించి సర్వం సిద్ధం చేశాయి.లక్ష మందికి పైగా టీచర్లు విధుల్లోకి.రాష్ట్రంలో దాదాపు 26,000 కు పైగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలతో పాటు వేలాది ప్రైవేట్ విద్యాసంస్థలు సోమవారం నుంచి ఒకేసారి తెరుచుకోనున్నాయి. ఈ స్కూళ్లలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సుమారు 1.10 లక్షల మందికి పైగా ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది తమ విధులకు హాజరు కానున్నారు. నిజానికి జూన్ 12నే స్కూళ్లు తెరుచుకోవాల్సి ఉన్నప్పటికీ, ఎండల తీవ్రత దృష్ట్యా అధికారులు జూన్ 15కి వాయిదా వేశారు. ఈ మూడు రోజుల పనిదినాల నష్టాన్ని భర్తీ చేసేందుకు జూలై 11న వచ్చే రెండో శనివారం నాడు పాఠశాలలను యథావిధిగా నడపాలని విద్యాశాఖ నిర్ణయించింది. కొత్త అకడమిక్ క్యాలెండర్ పాఠశాల విద్యాశాఖ రూపొందించిన నూతన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది మొత్తం 227 పనిదినాలు ఉంటాయి. దీని ప్రకారం జూలై 31 లోపు ఫార్మేటివ్ అసెస్‌మెంట్, సెప్టెంబర్ 21 నాటికి FA–2, అక్టోబర్ 1 నుంచి 9 వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (SA-1) పరీక్షలు నిర్వహిస్తారు. ఇక పండుగ సెలవుల విషయానికి వస్తే, అక్టోబర్ 10 నుండి 22 వరకు దసరా సెలవులు, డిసెంబర్ 23 నుండి 27 వరకు క్రిస్మస్ సెలవులు (మిషనరీ స్కూళ్లకు), అలాగే 2027 జనవరి 13 నుండి 17 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయి. ఈ పూర్తి విద్యా సంవత్సరం 2027 ఏప్రిల్ 23తో ముగుస్తుంది, ఆ మరుసటి రోజు నుంచే విద్యార్థులకు మళ్లీ వేసవి సెలవులు ప్రారంభమవుతాయి. మొదటి రోజే పుస్తకాలు, రాగిజావ పంపిణీ ప్రభుత్వ స్కూళ్లలో చదివే పేద విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా స్కూల్ తెరిచిన మొదటి రోజే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. దీనితో పాటు విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపరచడం, బడికి వచ్చేలా ప్రోత్సహించే లక్ష్యంతో 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకాన్ని, రాగిజావ పంపిణీని కూడా ఈసారి పకడ్బందీగా అమలు చేయనున్నారు. కొత్త క్లాసులు, సరికొత్త పాఠాలతో ప్రారంభం కానున్న ఈ విద్యా ప్రయాణం కోసం అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన..

**-మొదటిపేజీ తరువాయి:** ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు తేలికపాటి సంభాషణలో మునిగిపోయారు. విల్లాను కలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. విల్లా కెరిలోస్ అనేది 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఒక అసాధారణమైన హౌస్ మ్యూజియం. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, ఎంతో నిశితంగా ఆధునిక కాలంలో దీన్ని పునఃసృష్టించారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరా తీరంలో, నైస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీ–సర్–మెర్ అనే ప్రాంతంలో ఈ విల్లా ఉంది. మధ్యధరా సముద్రానికి అభిముఖంగా ఒక రాతి ద్వీపకల్పంపై కొలువై ఉన్న ఈ భవనం, ప్రస్తుతం చారిత్రక కట్టడంగా వర్గీకరించబడింది. దీని యాజమాన్య హక్కులను 'ఇన్‌స్టిట్యూట్ డి ఫ్రాన్స్' కలిగి ఉంది. అంతకుముందు, నీస్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని మోదీ, మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్‌లో సంస్కరణల వేగం తగ్గబోదని స్పష్టం చేశారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరణకు సిద్ధంగా ఉందన్నారు. గత 11–12 ఏళ్లలో బలమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించుకున్నామని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ప్రపంచ సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేసేందుకు తమతో కలిసి పనిచేయాలని ప్రపంచ ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావడం ఫ్రాన్స్‌కు ఎంతో గౌరవకారణమని అధ్యక్షుడు మేక్రాన్ అన్నారు. భారత నేతగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు మోదీని అభినందించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ పాత్రను ఆయన ప్రశంసించారు. అధ్యక్షుడు మేక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ శనివారం ఫ్రాన్స్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు మోదీ పలువురు ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటల్ అధిపతులతో కూడా సమావేశమయ్యారు.

# వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**-మొదటిపేజీ తరువాయి:** రాష్ట్రంలో వర్షాకాల పరిస్థితులు, వరద ముప్పు, పట్టణాలు, గ్రామాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్ అండ్ బీ, జలమండలి వంటి విభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొని తమ శాఖల సిద్ధతపై వివరాలు అందించారు. ఈ సమావేశంలో వరదల నివారణ, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుదల, అత్యవసర సేవల సమన్వయం, ప్రజల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం సమగ్ర మార్గదర్శకాలు ఇచ్చారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు, ఎప్పటికప్పుడు అప్రమత్తత అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్ హాజరయ్యారు. అలాగే సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేశ్ రంజన్, వికాస్‌రాజ్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కూడా హాజరయ్యారు. పోలీస్ శాఖ నుంచి సజ్జనార్, రమేశ్ రెడ్డి, సుమతి వంటి పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు. అలాగే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

# సింగరేణి కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతున్నారు

**-మొదటిపేజీ తరువాయి:** బొగ్గు నిల్వలు మాయమైనట్లుగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో శ్రీరాంపూర్ ఓసీపీ వద్ద సింగరేణి అధికారులతో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ఆదివారం)ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. సింగరేణి కార్మికుడి శ్రమ, చెమటని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు మాట్లాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిపై చేస్తున్న ఆరోపణలతో తన మనసు కలచి వేసిందని.. అందుకే అధికారులతో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు. మీ రాజకీయాల కోసం, స్వార్థం కోసం తెలంగాణ భవిష్యత్తు అయిన సింగరేణిని అపహాస్యం చేయొద్దని హితవు పలికారు. బొగ్గును వెలికి తీసిన తర్వాత గ్రేడ్‌ల వారీగా స్టాక్ పెడతామని వివరించారు. నిల్వలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వివరించారు. బొగ్గు తరలించే వాహనాలకు జీపీఎస్ సైతం ఉంటుందని స్పష్టం చేశారు. విజిలెన్స్ మానిటరింగ్ కూడా ఉంటుందని చెప్పుకొచ్చారు. కిలో బొగ్గు బయటకు వెళ్లే అవకాశం లేదని తేల్చిచెప్పారు. అసలైన ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోంది: మల్లు భట్టి విక్రమార్క ఎస్ఐఆర్‌ను అడ్డంపెట్టుకొని అసలైన ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోందని మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఓటు లేకపోతే పౌరసత్వానికి ప్రమాదం ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇవాళ మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ బీఎల్ఏల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావ్, ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. కాంగ్రెస్‌కి మద్దతు తెలిపే వారిని ఏఐ టెక్నాలజీతో లిస్టు ఔట్ చేస్తున్నారని.. వారందరిని హోల్డ్‌లో పెడుతున్నారని తెలిపారు. బీజేపీ నేతలు చాలా ప్లాన్డ్‌గా ఓట్ల తొలగిస్తున్నారని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అయ్యే సమయంలో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని.. కానీ అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఓటర్ల మ్యాపింగ్ కాలేదని 80 వేల మందిని అన్ మ్యాపింగ్ చేశారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**సింగరేణిపై కొంతమంది అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు: మంత్రి శ్రీధర్ బాబు**

నిరంతరం సింగరేణిపై కొంతమంది అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహించారు. పదే పదే అసత్యాలతో నాటి తప్పులను కప్పి పుచ్చుకోలేరని అన్నారు. సింగరేణిని కాపాడేది కేవలం కాంగ్రెస్ మాత్రమేనని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# భారతీయ నావికుల మృతి

**-మొదటిపేజీ తరువాయి:** హర్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాకు ఒక నమ్మకమైన సేవకుడిలా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. అమెరికా ఏమాత్రం పశ్చాత్తాపం చూపకపోగా, వారి ఆదేశాలను పాటించని నౌకలను సహించబోమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో హెచ్చరించడాన్ని ఆయన తప్పుబట్టారు. "అమెరికా దాడుల్లో మన ముగ్గురు నావికులు చనిపోయి కొద్ది రోజులే అయింది. అయినా ఇంతవరకు వారి నుంచి కనీసం పశ్చాత్తాపం లేదు, క్షమాపణ లేదు. పైగా, మనకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. "అమెరికా సైన్యం ఆదేశాలను తక్షణమే పాటించాలి. ఎలాంటి ఉల్లంఘనలైనా సహించేది లేదు" అన్న వారి మాటలు చూడండి. ఒక స్వతంత్ర దేశం ఇలాంటి భాషను ఎప్పటికీ సహించదు. కానీ మన బలహీన ప్రధాని మాత్రం నోరు మెదపడం లేదు. ఒక విధేయుడైన సేవకుడిలా వారి ఆదేశాలను వింటున్నారు, పాటిస్తున్నారు. ఈ బలహీన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేరు. ఎందుకంటే, దేశాన్ని అవమానించే వాళ్లే ఆయన నియంత్రణలో ఉన్నారు. అందుకే మన వాళ్లను చంపినా, మనల్ని అవమానించినా ఆయన మౌనంగా ఉండిపోతున్నారు. ఇది దేశ ప్రజలందరూ గమనించాలి" అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర నేతలు కూడా కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఈ ఘటనపై అమెరికా బేషరతుగా క్షమాపణ చెప్పాలని పవన్ ఖేరా డిమాండ్ చేశారు. విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందన చాలా బలహీనంగా ఉందని, ఆయన కేవలం "ఇది సమర్థనీయం కాదు" అనడం సరికాదని అన్నారు. మరో నేత మనీశ్ తివారీ మాట్లాడుతూ, అమెరికా మంత్రి వ్యాఖ్యలు బెదిరింపుగా ఉన్నాయని, నావికుల మృతికి వారే కారణమన్నట్లుగా ఉన్నాయని ఆరోపించారు. మరోవైపు, ఈ ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికాతో మాట్లాడి, నావికుల మృతిపై తీవ్ర నిరసన తెలిపినట్లు వెల్లడించారు. వాణిజ్య నౌకలపై ప్రాణాంతక దాడులు సమర్థనీయం కాదని స్పష్టం చేసినట్లు తెలిపారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఈ ఘటన, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రంగా మారింది.

## ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేసిన విజయ్ దేవరకొండ

**-మొదటిపేజీ తరువాయి:** ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ తన సొంతూరికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన 'ది దేవరకొండ ఫౌండేషన్' ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డివిజన్‌లోని 45 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 180 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేశారు. 9, 10వ తరగతుల్లో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు అందించారు. ఈ కార్యక్రమానికి విజయ్ దేవరకొండతో పాటు ఆయన అర్ధాంగి, నటి రష్మిక మందన్న, తల్లి మాధవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, జిల్లా విద్యాధికారి రమేష్ తదితరులు హాజరయ్యారు. ఇటీవల తన వివాహం అనంతరం సొంత గ్రామమైన తుమ్మన్‌పేటలో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌లో విజయ్ ఈ హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం ఈ కార్యక్రమాన్ని చేపట్టడంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, "ఎంత ఎత్తుకు ఎదిగినా విజయ్ దేవరకొండ తన సొంత ఊరును మర్చిపోకపోవడం ఆయన గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయం. ఈ కార్యక్రమాన్ని ఏటా కొనసాగిస్తామని చెప్పడం సంతోషకరం" అని అన్నారు. విజయ్ ఇండస్ట్రీలో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. రష్మిక మందన్న మాట్లాడుతూ, "ది దేవరకొండ ఫౌండేషన్ ద్వారా మంచి పని చేయాలనుకున్నప్పుడు, మొదట మామయ్య పుట్టిన ఊరి నుంచే ప్రారంభించాలని నిర్ణయించుకున్నాం. మీరంతా కష్టపడి చదివి మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా చేశారు. జీవితంలో గెలుపోటములు సహజం, కానీ నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగాలి. తల్లిదండ్రులను, గురువులను గౌరవించి గొప్ప స్థాయికి ఎదగాలి" అని విద్యార్థులకు సూచించారు. విజయ్ దేవరకొండ తల్లి మాధవి మాట్లాడుతూ, "పిల్లల ఫీజులు చెల్లించడం ఎంత కష్టమో మాకు తెలుసు. పిల్లలు తమ తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకోవాలి. అదే సమయంలో, తల్లిదండ్రులు కూడా పిల్లల కలలను నిజం చేసేందుకు ప్రోత్సహించాలి. డ్యూటీ, డిసిప్లెయిన్, డివోషన్, డెడికేషన్, డిటెర్మినేషన్ అనే ఐదు 'డి'లు పాటిస్తే జీవితంలో విజయం తథ్యం" అని పేర్కొన్నారు. అనంతరం విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "మీ విజయాన్ని సెలబ్రేట్ చేయడానికే ఈ కార్యక్రమం చేపట్టాం. మార్కుల కన్నా, వాటిని సాధించడానికి మీరు పడిన శ్రమ, ఏకాగ్రత చాలా గొప్పవి. జీవితంలో ఫోకస్, క్రమశిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చు. నేను, రష్మిక మా స్టూడెంట్ లైఫ్‌లో ర్యాంకర్స్ కాదు. కానీ మీ విజయాన్ని చూసి గర్వపడుతున్నాం. ఈసారి ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం ఆనందంగా ఉంది. ఈ ఘనత ఉపాధ్యాయులదే" అని అన్నారు. "మా తల్లిదండ్రులు ఈ ఊరితో పెంచుకున్న అనుబంధం వల్లే నేను ఈ కార్యక్రమం చేయగలుగుతున్నాను. ఇప్పుడు అచ్చంపేటలో ప్రారంభించాం. భవిష్యత్తులో నాగర్‌కర్నూల్ జిల్లా, ఆ తర్వాత తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించాలనేది నా కల. ఈ ఉపకార వేతనాలు నిజమైన అర్హులకు మాత్రమే చేరేలా చూడాలని విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను కోరుతున్నాను. ఇది దుర్వినియోగం అయితే నేను చాలా బాధపడతా" అని స్పష్టం చేశారు. కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడించింది రేవంత్ రెడ్డే

**-మొదటిపేజీ తరువాయి:** ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ ఒప్పందాలపై మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని, దీనికి ప్రతీకారంగానే హైదరాబాద్‌లో ఆమెపై తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే నైజం రేవంత్ రెడ్డిదని ఆయన దుయ్యబట్టారు. హిట్లర్ తన ఆదర్శం అని సీఎం చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనను 'అట్టర్ ఫ్లాప్ సినిమా'గా అభివర్ణించిన కేటీఆర్, ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, కనీసం 4,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ప్రశ్నించారు. రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని కూడా విస్మరించారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేశామని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రజాతీర్పును ధిక్కరించి దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించడమే దీనికి కారణమని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి జరిగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, డిజిటల్ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
సోమవారం 15 జూన్ 2026

# సంపాదకీయం

## కాలాతీతాన్ని కాలంతో కొలవగలమా?

'అన్ని మతాలూ సనాతనం వైపే' శీర్షికతో నేను రాసిన (మే 24, 2026) వ్యాసానికి ప్రతిస్పందనగా 'సనాతన ధర్మం, చరిత్ర ఒకటేనా?' అంటూ రాణి శివశంకర శర్మ మే 31న వ్యాసం రాసినారు. కానీ ఆయన ప్రతిస్పందన నా వ్యాసంలోని ప్రధాన అంశాల గురించి లేదు. నా వ్యాసంలో నేను మూడు ప్రధాన అంశాలు ప్రతిపాదించినాను. 1. సనాతనం అంటే ఏమిటి? 2. అన్ని మతాలు 'సనా' అనబడే దేశకాలాతీత సత్యం వైపు పనిచేసేవే 3. ఒక తల్లికి పిల్లలు ఒకరు ముందు, మరొకరు తర్వాతా పుట్టినట్లు మతాలు కూడా సనాతనం నుంచి వెనకా ముందూ పుట్టినాయి. ఆ విధంగా అన్నీ సోదరమతాలే! అన్నీ సనాతన మతాలే! కానీ శివశంకర శర్మ వ్యాసంలో ఈ మూడు అంశాలకు ప్రతిస్పందన లోపించింది. ఈ అంశాలని ఆయన వ్యతిరేకించనూ లేదు, వీటిస్థానంలో కొత్త ప్రతిపాదనలూ చేయలేదు. మరి ఆయన ప్రతిస్పందనకు లక్ష్యం ఏమి? పైగా, ప్రతిపాదన అనే విజ్ఞప్తిని కూడా గౌరవించకుండా అసందర్భ పాండిత్యంతో, అభాండాలతో విజృంభించడంలో ఆయన ఉద్దేశం ఏమిటి? హిందూ ఫాసిస్ట్ అని లేబుల్ వేయడంలో మతలబు ఏమిటి? ఏ సాహిత్య సంస్థను తృప్తిపరచడానికి? ఏ సాహిత్య ముఠాను సంతోషపెట్టడానికి? నేను 'సనాతనం'ను భౌతికచరిత్రగా కుదించలేదు. కానీ మతాల చుట్టూ భౌతిక చరిత్ర వుంటుంది. దేశకాలాతీత సత్యాన్ని, దేశకాలబద్ధమైన చరిత్రలోకి కుదించే అవివేకమైన చర్యకు ఎవరైనా పాల్పడతారా? 'మతాలన్నీ సనాతనం వైపే' అన్న శీర్షికను చూసి, అది హిందూమత అహంకారం అని భావించినట్లు వున్నారు. కేవలం శీర్షికను బట్టి ప్రతిస్పందించడం అమాయకత్వం కాదా శర్మగారూ? శీర్షిక సరే, వ్యాసమంతా పరుచుకున్న విషయం మాటేమిటి? అది చదివితే మీ అపార్థం తొలగిపోయేది కాదా? ఈ దేశంలోకి ఇస్లాం ప్రవేశం గురించి నేను మాట్లాడలేదు. గాంధార దేశం ఇస్లామీకరణ, గోవా క్రైస్తవీకరణ గురించి పేర్కొన్నాను. విదేశీమతాలు అనే భావన అంబేడ్కర్ కాలం నుంచీ వుంది. అతడు ఇస్లాం, క్రిస్టియానిటీని స్వీకరించకుండా బౌద్ధం స్వీకరించడంలో ఆంతర్యం ఏమిటి? ఇంకా అనేక కారణాలు వున్నాయికానీ ఇక్కడ అప్రస్తుతం. అయిననూ విదేశీమతాలను అబ్రహామిక్ మతాలు అని పిలవడానికి నాకు ఏ అభ్యంతరమూ లేదు. ఒక మతం ఎక్కువ, ఒక మతం తక్కువ అని నా వ్యాసంలో ఎక్కడైనా రాసివున్నానా? నేను అబ్రహామిక్ మతాలను కురచ మతాలు అని ఎక్కడా రాయలేదు. హిందూమతంతో పోల్చినపుడు వాటి 'చారిత్రక కాలాలు' కురచగా (వయసు రీత్యా) వుంటాయి అన్నాను. మరోసారి చదవండి. ఇది అనవసరమైన నింద కాదా? ఈ దేశానికి-- ఒకే దేవుడు వుండాలని, అది రాముడు అనీ! ఒకే గ్రంథం వుండాలని, అది భగవద్గీత అనీ! ఒకే భాష వుండాలని, అది హిందీ అనీ! బోధించే భారతీయ జనతాపార్టీ రాజకీయాలకు నేను దూరం. ఇది పూర్తిగా పాకిస్థాన్ ఇస్లామిక్ స్టేట్‌కు అనుకరణ! శిలాసదృశమైన మతాన్నిగానీ, సమాజాన్నిగానీ భారతీయ బహుళత్వం కోరుకోదు! నిజమే.. నేను వర్ణధర్మాన్ని తిరస్కరిస్తాను. మీరు భుజం మీద మోస్తారా? పుట్టుకతో మనిషి శూద్రుడు అంటాయట వేదాలు! గుణకర్మలతో ముడిపడిన వర్ణధర్మాన్ని 'పుట్టుక'తో ముడిపెట్టడం నేను వ్యతిరేకిస్తాను. నేను నిష్ఠురమైన సంగతులు మాట్లాడుతున్నానని తెలుసు. అంతమాత్రంచేత ముస్లిం వ్యతిరేకత ఆపాదించడం దుడుకుతనం కాదా? నా పొరుగింటి అల్లాబక్ష్‌ను ఎందుకు వ్యతిరేకిస్తాను? నా బాల్యమిత్రుడు ఖాసీంపీరాను ఎందుకు వ్యతిరేకిస్తాను? కానీ తీవ్రవాదుల జిహాద్ చర్యలకు పులకించిపోయే ముస్లింలను కూడా ప్రేమించమంటారా? జిహాద్‌ను ఖండించే ధైర్యం చేయలేని సెక్యులరిస్టులను ప్రేమించమంటారా? జిహాద్‌ను ఖండింప నిరాకరించే ముస్లిం ఉద్యమకారుల రహస్య అజెండాను మన్నించమంటారా? నేను ప్రస్తావించిన జాతి గురించి మీరు అభ్యంతరం తెలిపారు. హిందూ ముస్లిం, క్రిస్టియన్ మతాలన్నిటినీ ఒక సుహృద్భావ వాతావరణంలోకి తెచ్చే జాతిస్పృహ, మన మధ్యయుగాల వర్ణధర్మం కంటే గొప్పది కాదా? కులనిర్మూలన వాదులలో ముస్లిం వ్యతిరేకత వుందన్న మీ సూత్రీకరణ చదివి ఆశ్చర్యపోయాను. ప్రతిదానినీ ఘర్షణాత్మకంగా చూడటం హిందుత్వ ఫాసిజంలో ఒక భాగం అన్నారు. దానిని నేనెందుకు వ్యతిరేకిస్తాను? 'మతాలు, మతాల కాన్సెప్టులు సనాతనాలు కావు' అన్నారు. అవన్నీ సనాతనం అని అన్నానా లేక 'సనాతనం' మతాలకు అతీతం అన్నానా? అబ్రహామిక్ మతాలతో పోల్చినప్పుడు హిందూ మతమే ప్రాచీన మతం అవుతుంది. అది గుర్తించడమేగానీ, గొప్పలు చెప్పుకోవడం అవుతుందా? నేను హిందూ తాత్విక గ్రంథాలు చదివినానుగానీ హిందూవాదులు రాసిన చరిత్ర చదవలేదు. నేను సావర్కర్‌నూ చదవలేదు, వేదమూ చదవలేదు. సావర్కర్‌తో నాకు సామీప్యత ఏమిటి? ఆధ్యాత్మికతకు చరిత్రను ప్రాతిపదికగా స్వీకరించడం అనేదే చాలా అసంబద్ధమైన విషయం. అది, కాలాతీతాన్ని కాలంతో కొలవబోయే అవివేకం. అటువంటి బైరప్పతో నాకేమిటి సామీప్యత? మ్లేచ్ఛ శబ్దానికి మీరు చెప్పిన అర్థాన్ని వ్యతిరేకించలేదే! వ్యాసంలో ఆ పదమే నేను ప్రస్తావించలేదే! మీకు గుర్తుకొచ్చిన పాండిత్యమంతా వెళ్లగక్కేదేనా సందర్భశుద్ధి లేకుండా? క్రైస్తవ మిస్టిక్ జ్ఞానానికి, అద్వైతానికి పోలికలు వున్నాయన్నారు. నేను చెప్పినది కూడా అదేకదా! శంకులో పోస్తేనే తీర్థమా శర్మగారూ! 'నేను, నా తండ్రి ఒకరే' ఇందులో వున్నది అద్వైతమే కదా! ద్విజాతి సిద్ధాంతం హిందువులలో లేదు. దానిని సనాతన ధర్మానికి ఆపాదించే దురదృష్ట ఘడియలు ఎప్పటికీ రావు. హిందూ, పాకిస్థానీ ఒక్కటే డీఎన్ఏ మూలాలు కలిగివున్నాయని ఆధునిక జన్యుశాస్త్రం రుజువు చేసింది కదా. ఇక్కడ సనాతనం అంటే కాలాతీత సత్యం అనీ, సనాతన ధర్మం అంటే మతం అనీ భావించకపోతే పొరపాటు పడతారు. ఈ బండి నారాయణస్వామి అనే జీవి-- పాతబస్తీలో ఖామోషీబాబా దర్గాలో కూర్చున్నవాడు; చార్మినార్ పక్కన మక్కామసీదులో ప్రాచీన సమాధుల్ని ప్రేమగా తడిమినవాడు; సూఫీతత్వాన్ని కొంత అధ్యయనం చేసి 'కడపటి యుద్ధం' నవల రాసినవాడు; గుడి, చర్చి, మసీదు... ఎక్కడ దైవస్పృహ కలిగితే, అక్కడ సాగిలబడి మొక్కేవాడు. కాలాతీత సత్యం గురించి మాట్లాడటానికి హిందూవాదుల చరిత్రలు అవసరం అవుతాయా? శర్మగారూ.. మీ పాండిత్యం సమాజానికి ఉపయోగపడవలెనంటే ఆ పాండిత్యంలో నుంచి ఏదో మినహాయించుకోవలసిన అవసరం వుంది. అదేదో మీరే కనుక్కోండి. హిందూఫాసిస్టుగా ముద్రకొట్టడం వెనుక ఏ అభ్యుదయ, ఏ కమ్యూనిస్టు, ఏ సెక్యులర్, ఏ బ్రాహ్మణ భావజాల అహంకారం పనిచేసిందో మీకే తెలియవలె!సెక్యులరిజం అంటే-- ముస్లింలను బుజ్జగించడమా? లేక ముస్లింలను ప్రేమించడమా.

# మోదీ వల.. విపక్షం విలవిల






రాజకీయాలలో విలువలు పతనమయ్యాయి. 'జో జీతేగా వహీ సికందర్' అన్నట్టుగా పరిస్థితి మారింది. ఎన్డీయే నాయకుడిగా ప్రధాని మోదీ బాహుబలిగా ఎదగగా, ప్రతిపక్ష ఇండియా కూటమి సమర్థ నాయకత్వం కొరవడి మోదీని ఢీకొనలేక డీలాపడిపోయింది. ప్రధాని మోదీ రాజకీయ ఎత్తుగడలను అర్థం చేసుకోలేని ఇండియా కూటమి తన ఉనికిని చాటుకోవడానికి సతమతమవుతోంది. ప్రధాని మోదీ దేశ ప్రజలు, ముఖ్యంగా యువత మనోభావాలను పసిగట్టి అందుకు తగిన వ్యూహాలను రూపొందించుకొని ఎన్నికల్లో విజయాలు సాధిస్తుండగా, ఇండియా కూటమి నేతలు మాత్రం పాత చింతకాయ పచ్చడి ఆలోచనలతోనే అడుగులు వేస్తున్నారు. దీంతో ఇండియా కూటమి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ బలంగా ఉన్న రాష్ట్రాల్లో బలమైన నేతల కోసం మోదీ అన్వేషణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే హరీశ్ రావు కోసం తెర వెనుక ప్రయత్నాలు కొనసాగిస్తూనే సీఎం రేవంత్ రెడ్డిని తనతో చేతులు కలపాలని బహిరంగంగానే ఆయన కోరారు. ఈ మాట సరదాగా అన్నట్టు పైకి అనిపించినా ప్రధాని ఆంతర్యం అర్థం కావాల్సిన వారికి అర్థమైంది. నిన్నటి వరకు కేంద్రంలో బీజేపీని గద్దె దించుతామని గర్జించిన దీదీ మమతా బెనర్జీ ఇప్పుడు తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు తృణమూల్‌ను కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడానికి కూడా సిద్ధపడుతున్నట్టు వార్తలొస్తున్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్‌లోనే ఉండిన ఆమె ఆ పార్టీతో విభేదించి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేయడం గమనార్హం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏకబిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నాయకుడిగా నరేంద్ర మోదీ దేశ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు సంబరాలు జరుపుకోగా, మోదీని నిలువరించడం ఎలా? అని ప్రతిపక్ష ఇండియా కూటమి తల పట్టుకుంటోంది. నిజానికి భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కుమార్తె ఇందిరా గాంధీ... మోదీకంటే ఎక్కువ రోజులు ప్రధానమంత్రులుగా కొనసాగారు. నెహ్రూ సైతం మూడు పర్యాయాలు వరుసగా ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ వయోభారం, అనారోగ్య సమస్యలతో ప్రధానమంత్రిగా ఉండగానే కన్నుమూశారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే హత్యకు గురయ్యారు. ఈ కారణంగా ప్రధాని మోదీ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. రాజకీయాలలో ఈ శతాబ్దం నాది అని మోదీ సగర్వంగా చెప్పుకోగలుగుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజులతో పోల్చితే వర్తమాన రాజకీయాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. రాజకీయాలలో విలువలు పతనమయ్యాయి. 'జో జీతా వహీ సికందర్' అన్నట్టుగా పరిస్థితి మారింది. ఎన్డీయే నాయకుడిగా ప్రధాని మోదీ బాహుబలిగా ఎదగగా, ప్రతిపక్ష ఇండియా కూటమి సమర్థ నాయకత్వం కొరవడి మోదీని ఢీకొనలేక డీలాపడిపోయింది. ప్రధాని మోదీ రాజకీయ ఎత్తుగడలను అర్థం చేసుకోలేని ఇండియా కూటమి తన ఉనికిని చాటుకోవడానికి సతమతమవుతోంది. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవడం ఎలా? అని ఇదే భారతీయ జనతా పార్టీతో సహా అనేక ప్రతిపక్షాలు తల పట్టుకోగా, ఇప్పుడు మోదీ శక్తియుక్తుల ముందు కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు నిస్సహాయంగా మిగిలాయి. ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ నియంతలా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం బలపడటంతోపాటు ఆమె దేశంలో అత్యవసర పరిస్థితిని విధించడంతో నాడు ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో రైటిస్టులు, లెఫ్టిస్టులు ఏకమై జనతా పార్టీకి పురుడు పోశారు. 1977 ఎన్నికల్లో జేపీ ఆధ్వర్యంలో జనతా పార్టీ ఇందిరా గాంధీని ఓడించి మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే, నాయకుల మధ్య విభేదాల కారణంగా జనతా పార్టీ ప్రభుత్వం ఎంతో కాలం నిలవలేదు. ఇందిరా గాంధీ మళ్లీ అధికారంలోకి వచ్చారు. అయితే, పదవీకాలం పూర్తి కాకుండానే ఆమె తన సొంత అంగరక్షకులైన సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్ చేతిలో హత్యకు గురయ్యారు. ఇది చరిత్ర!

### -ఎవరు గొప్ప?

తొలి ప్రధాని నెహ్రూకంటే ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గొప్పవారా? అంటే ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. వర్తమాన రాజకీయాలలో మోదీ మహాబలుడని మాత్రం చెప్పవచ్చు. ఒక నాయకుడు మూడు ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత బలహీనపడటం, ప్రతిపక్షాలు బలం పుంజుకోవడం సహజం. అయితే ఇప్పుడు దేశ రాజకీయాలలో ఆ పరిస్థితి లేదు. ప్రధాని మోదీ గత ఎన్నికల్లో కొంత బలహీనపడినా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మరింత బలపడ్డారు. ప్రధాని మోదీని ఢీకొనడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు తమ సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి. అయితే, ఆ కూటమికి 1977లో వలె జయప్రకాశ్ నారాయణ్ వంటి సమర్థ నాయకత్వం లేకపోవడంతో పుంజుకోలేక పోతోంది. ఇండియా కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీకి చెందిన రాహుల్ గాంధీ నాయకత్వంపై భాగస్వామ్య పక్షాలకు విశ్వాసం లేకపోవడంతో ఎవరికి వారు తామే ప్రధానమంత్రి అభ్యర్థిగా ఊహల పల్లకిలో ఊరేగారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ తర్వాత తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎంకే ప్రధాన పార్టీలుగా ఉండేవి. ఇది గమనించిన మోదీ ఆ పార్టీలపై దృష్టి కేంద్రీకరించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి కేంద్ర స్థానమైన ఢిల్లీపై నజర్ పెట్టారు. అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీలోనే ఓడించి బీజేపీని అధికార పీఠంపై కూర్చోబెట్టారు. ఎన్నికల్లో ఓటమితో పాటు లిక్కర్ స్కాంలో జైలుకు కూడా వెళ్లిన కేజ్రీవాల్ ప్రస్తుతం ఇండియా కూటమితో అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. రాజకీయంగా ఎదురుదెబ్బలు తగలక ముందు కాంగ్రెస్ పార్టీ కంటే తమదే పెద్ద పార్టీ అని, ఇండియా కూటమికి తానే నాయకత్వం వహిస్తానని, కుదిరితే తానే ప్రధానమంత్రి కావాలని కేజ్రీవాల్ కలల ప్రపంచంలో విహరించారు. కారణం తెలియదుకానీ ప్రస్తుతం ఆయన సైలెంట్‌గా ఉంటున్నారు. నిన్నటి వరకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్న మమతా బెనర్జీ కూడా ప్రధాని కావాలని ఉవ్విళ్లూరారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉన్నప్పటికీ కూటమికి ఆ పార్టీ నాయకత్వం వహించడాన్ని ఆమె వ్యతిరేకిస్తూ వచ్చారు. కూటమిలోని మిగతా పార్టీల నాయకులు ప్రధానమంత్రి పదవిని కోరుకోకపోయినా సొంత ఎజెండాలతో ముందుకు సాగారు. అదే సమయంలో ఇండియా కూటమికి బలమైన నాయకత్వం అందించడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, తమిళనాడులో జరిగిన తాజా ఎన్నికల్లో భాగస్వామ్య పక్షాలైన తృణమూల్, డీఎంకే పార్టీలు ఓడిపోయాయి. ఓటమి తర్వాత అంతర్గత తిరుగుబాటుతో మమతా బెనర్జీ సతమతమవుతూ ఉండగా, ఎన్నికల ఫలితాల తర్వాత మాట మాత్రం చెప్పకుండా కాంగ్రెస్ పార్టీ తమను కాదని జోసెఫ్ విజయ్‌కి మద్దతు ప్రకటించడంపై డీఎంకే అధినేత స్టాలిన్ ఆగ్రహం చెందారు. దీంతో ఇండియా కూటమిపై ఆయన అలిగారు. కాంగ్రెస్ పార్టీతో దశాబ్దాలుగా కొనసాగిన స్నేహానికి కటీఫ్ చెప్పారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, స్టాలిన్ దూరం కావడంతో ఇండియా కూటమి బలహీనపడింది. మమతా బెనర్జీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. క్షవరం అయితేగానీ వివరం తెలియదు అన్నట్టుగా ఇండియా కూటమి ఉలిక్కిపడి తాజాగా సమావేశమై కూటమి బలోపేతంపై చర్చలు జరిపింది. అయితే, ఈ సమావేశంలో కూడా వినూత్నంగా ఆలోచించకుండా... ప్రజలను ఆకట్టుకోలేకపోయిన 'సర్' వంటి అంశాలతోనే ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ప్రధాని మోదీ దేశ ప్రజలు, ముఖ్యంగా యువత మనోభావాలను పసిగట్టి అందుకు తగిన వ్యూహాలను రూపొందించుకొని ఎన్నికల్లో విజయాలు సాధిస్తుండగా, ఇండియా కూటమి నేతలు మాత్రం పాత చింతకాయ పచ్చడి ఆలోచనలతోనే అడుగులు వేస్తున్నారు. దీంతో ఇండియా కూటమి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఎన్డీయే కూటమిలో ప్రధాన పార్టీ అయిన భారతీయ జనతా పార్టీ నానాటికీ బలపడుతుండగా, ఇండియా కూటమిలోని ప్రధాన పక్షమైన కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకోలేక పోతున్నది. ప్రధాని మోదీ ఎత్తుగడలతో పాటు ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి.

### -'ఇండియా'లో ఎవరికి వారే

ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలు బలహీనపడటానికి కారణాలు స్పష్టమే. కాంగ్రెస్ పార్టీ బూజు పట్టిన సిద్ధాంతాలను పట్టుకొని వేలాడుతుండగా, కూటమిలోని మిగతా భాగస్వామ్య పక్షాల నేతలు వివిధ కారణాలతో బలహీనపడ్డారు. అరవింద్ కేజ్రీవాల్ మితిమీరిన ఆత్మవిశ్వాసంతోపాటు లిక్కర్ కుంభకోణంలో చిక్కుకోవడం వల్ల ప్రజల్లో పలుచనయ్యారు. చివరకు ఆయన అధికారం కోల్పోయారు. మమతా బెనర్జీ అధికారంలో ఉన్నంత కాలం అహంకారపూరితంగానే వ్యవహరించారు. తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా చేశారు. ఫలితంగానే ఆ పార్టీలో ఇప్పుడు తిరుగుబాట్లు చూస్తున్నాం. అధికారం కోల్పోగానే ఎంపీలు, ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడం సమర్థనీయమా? అంటే ఏం చెప్పగలం! వర్తమాన రాజకీయాల్లో అన్ని పార్టీలకూ ఈ బెడద తప్పడం లేదు. ప్రాంతీయ పార్టీలలో అధినేతల పోకడలే ఆయా పార్టీల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అధినేతలు అహంకారపూరితంగా వ్యవహరించినా, అవినీతి ఊబిలో కూరుకుపోయినా ఆయా పార్టీలు చావుదెబ్బ తింటాయి. ఒకప్పుడు జాతీయ పార్టీలైనా, ప్రాంతీయ పార్టీలైనా అధినేతల పోకడలు నచ్చనప్పుడు.. బలమైన నాయకులు ఆ పార్టీల నుంచి బయటకు వెళ్లి సొంత పార్టీలు పెట్టుకోవడం లేదా ఇతర పార్టీలతో చేతులు కలపడం చేసేవారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ఈ విధంగానే కాంగ్రెస్‌తో విభేదించి ఎన్టీఆర్‌తో చేతులు కలిపి నేషనల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1989 ఎన్నికల్లో విజయం సాధించిన వీపీ సింగ్ ప్రధానమంత్రి అయ్యారు.

### -కాంగ్రెస్ అలా... మోదీ ఇలా!

జాతీయ పార్టీలలోనైనా, ప్రాంతీయ పార్టీలలోనైనా అంతర్గత ప్రజాస్వామ్యం లోపించి నియంతృత్వ పోకడలు పొడచూపినప్పుడు ఆయా పార్టీలలో తిరుగుబాట్లు రావడం సహజం. ఈ కారణంగానే బలమైన పార్టీలుగా భావిస్తూ వచ్చిన అనేక పార్టీలు బలహీనపడ్డాయి. కాంగ్రెస్ పార్టీనే ఇందుకు ఉదాహరణ! రాష్ట్రాలలో బలమైన నాయకత్వాలను పక్కనపెట్టడం వల్ల కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించుకుంది. ప్రస్తుత దుస్థితికి ఇదే ప్రధాన కారణం. ప్రధాని మోదీ ఈ విషయంలో జాగ్రత్తపడ్డారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఒక విధంగా, బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో మరో విధంగా ద్విముఖ వ్యూహాలతో ఆయన విజయాలు అందుకుంటున్నారు. రాజకీయ ప్రత్యర్థులను బలహీనపరచగల సమర్థత ఉన్న నాయకులను గుర్తించి వారిని చేరదీయడంపై ప్రధాని మోదీ దృష్టి సారిస్తారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇందుకు నిదర్శనం. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రస్తుతం ప్రధాని మోదీ కన్ను పడింది. భారత రాష్ట్ర సమితికి చెందిన హరీశ్ రావును తమ వైపునకు లాక్కోవాలని ప్రయత్నిస్తూనే... రేవంత్ రెడ్డిపై కూడా ఆయన దృష్టి సారించారు. ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో బలమైన నాయకుల కోసం మోదీ అన్వేషణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే హరీశ్ రావు కోసం తెర వెనుక ప్రయత్నాలు కొనసాగిస్తూనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తనతో చేతులు కలపవలసిందిగా బహిరంగంగానే ఆయన కోరారు. ఈ మాట సరదాగా అన్నట్టు పైకి అనిపించినా ప్రధాని ఆంతర్యం అర్థం కావాల్సిన వారికి అర్థమైంది. ఆ ఇరువురిలో ఎవరో ఒకరు వారికి కావాలి. తెలంగాణతోపాటు తమిళనాడుపై ప్రస్తుతం ప్రధాని మోదీ దృష్టి సారించారు. ఎన్నికల ఫలితాలు వెలువడగానే డీఎంకే పార్టీకి ఆయన స్నేహ హస్తం చాస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల గుర్రుగా ఉన్న స్టాలిన్‌ను తమ వైపునకు తిప్పుకొనే ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జోసఫ్ విజయ్ తొలిసారిగా ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధానమంత్రి మోదీని కలిశారు. ఆ తర్వాత హోం మంత్రి అమిత్ షాను కూడా కలవాలనుకున్నారు. నిజానికి విజయ్‌కి అమిత్ షా అప్పాయింట్‌మెంట్ కూడా ఇచ్చారు. అయితే చివరి నిమిషంలో అది రద్దయింది. స్టాలిన్ విజ్ఞప్తి మేరకే విజయ్‌కి ఇచ్చిన అప్పాయింట్‌మెంట్‌ను అమిత్ షా రద్దు చేసుకున్నారన్న వాదన ప్రచారంలో ఉంది. దీన్నిబట్టి బీజేపీ--డీఎంకే మధ్య స్నేహం చిగురించే అవకాశం లేకపోలేదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ విధంగా మోదీ--షాల ఆలోచనలు ఇండియా కూటమి నాయకులకు అంతుబట్టని రీతిలో ఉంటున్నాయి.

### -కోలుకోకుండా దెబ్బమీద దెబ్బ

ఇండియా కూటమి నాయకులు నిన్నటి గురించి ఆలోచిస్తుండగా, మోదీ--షాలు రేపటి గురించి ఆలోచిస్తున్నారు. ఎన్నికల్లో ఓడిన పార్టీలను అంతటితో వదిలేయకుండా ఆయా పార్టీలు తిరిగి కోలుకోకుండా చేస్తున్నారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుత దుస్థితే ఇందుకు నిదర్శనం. ఎన్నికల ఫలితాలు వెలువడగానే టీఎంసీ ఎమ్మెల్యేలలో తిరుగుబాటు వచ్చిందంటే దాని వెనుక మోదీ--షాల హస్తం లేదని ఎలా భావించగలం? రెండేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో నెగ్గిన ఎంపీలలో మెజారిటీ సభ్యులు ఎన్డీయేలో చేరడానికి సిద్ధపడుతున్నారంటే అందుకు మోదీ--షా మంత్రాంగం కారణం కాకుండా ఉంటుందా? ఈ నేపథ్యంలోనే తమ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు డీఎంకే అధినేత స్టాలిన్ బీజేపీతో సన్నిహితంగా మెలగడానికి సిద్ధపడుతున్నట్టు భావించాలి.

# మునీర్ స్ఫూర్తి తో సింగరేణిని పరిరక్షిస్తాం





**-కార్మికుల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం**

**-కార్మిక శాఖా మంత్రి వివేక్ వెంకటస్వామి**

హంస కలం వార్త జూన్ 14 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

సింగరేణి సంస్థను పరిరక్షించే బాధ్యతను తాను,తమ ప్రభుత్వం తీసుకుంటుందని కార్మిక,గనుల శాఖా మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి హామీ ఇచ్చారు. ఆదివారం మందమర్రిలో సీనియర్ జర్నలిస్ట్ మునీర్ పై రాసిన మునీర్ భాయ్ పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య ఆవిష్కర్తగా హాజరై ప్రసంగించారు. గతంలోసింగరేణి సంస్థ సిక్ ఇండస్ట్రీగా మారి బి.ఐ.ఎఫ్ ఆర్.పరిధిలోకి పోయినప్పుడు తన తండ్రి అయిన కాకా వెంకటస్వామి సింగరేణి కాపాడి నాడన్నారు.ఆ కాలంలో మునీర్ తన వార్తల ద్వారా సంస్థ పరిరక్షణకు మార్గ నిర్దేశనం చేసినాడన్నారు.ఆ మునీర్ స్ఫూర్తితోనే సింగరేణి పరిరక్షణకు అంద రమూ కలసి కృషి చేయాలని పిలుపు నిచ్చారు.తెలంగాణ ఉద్యమంలో మునీర్ కృషి ఎంతగానో ఉందన్నారు.ఎంత నిక్కచ్చిగా వార్తలు రాసేవాడో అంటే నిఖార్సుగా మనుషుల పట్ల ప్రేమా భిమానాలతో ఉండేవాడన్నారు.మునీర్ పేరిట ప్రెస్ భవన్,ఆయన విగ్రహ ప్రతిష్ఠాపన కోసం స్థలం కై సింగరేణి తో మాట్లాడుతానన్నారు. మునీర్ కుటుంబం తో తమకున్న అనుభవాన్ని ఆయన నెమరు వేసుకున్నాడు.మానవ హక్కుల పట్ల,కార్మిక పోరాటాల పట్ల అతని నిబద్ధత వెలకట్ట లేనిదన్నారు. అతని కుటుంబానికి పెన్షన్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. పవన్, మునీర్ జీవిత చరిత్ర చదువు. తెలంగాణ తత్వం బోధపడుతుంది.

**-ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్**

తెలంగాణ లో ఇల్లు కట్టుకుని ఉంటూ తెలంగాణ లోనే ప్రెస్ మీట్ పెట్టి "నన్ను తెలంగాణకు రానివ్వరా,మీ జాగీరా"అని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీ.ఎం.పవన్ కళ్యాణ మాట్లాడటం హాస్యాస్పదమని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.మునీర్ పుస్త కావిష్కరణ సభలో మాట్లాడుతూ పవన్ కు తెలంగాణ తత్వం బోధపడలేదన్నారు.మునీర్ పై రాసిన ఈ పుస్తకం చదివితే అర్థమవుతుందని ప్రకాశకులు ఒక పుస్తకాన్ని ఆయనకు పోస్ట్ చేయాలని సూచించారు. మునీర్ సమాజ ఉన్నతి కోసం జీవితాంతం కృషి చేశాడన్నారు.విద్యార్థికార్మిక నాయకుడిగా, జర్నలిస్ట్ గా,తెలంగాణ ఉద్యమ కారునిగా ఆయన ప్రస్థానం ఈ సమాజం పై చెరగని ముద్ర వేసిందన్నారు.సింగరేణి కార్మికోద్యమాలల్లో అతను చురుకైన పాత్ర పోషించాడన్నారు.ఆయన జీవిత చరిత్రను అందరూ చదవాలని అన్నారు.ఈ పుస్తకం యాభై సంవత్సరాల కోల్బెల్ట్ ఉద్యమాల చరిత్రను రికార్డ్ చేసిందన్నారు. సాహసిక జర్నలిస్ట్ మునీర్

**-సీనియర్ సంపాదకులు రామచంద్ర మూర్తి**

మునీర్ సాహసికుడైన జర్నలిస్ట్ అని ప్రముఖ సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి కొనియాడారు. తాను సింగరేణిలో పనిచేసిన అనుభవం ఉందని, సింగరేణి ప్రాంత సమస్యలను బలంగా వినిపించిన వ్యక్తి మునీర్ అన్నారు.తెలంగాణ ఉద్యమ కాలంలో తాను హెచ్.ఎం.టివి తరపున నిర్వహించిన దశ దిశ కార్యక్రమంలో మునీర్ సింగరేణిలో వివక్ష గురించి అద్భుతంగా వివరించారన్నారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ విప్ నల్లాల ఓదెలు మాట్లాడుతూ మునీర్ సహచరున్ని అయినందుకు గర్వపడుతున్నానని అన్నారు.తన జీవితం లో మునీర్ సలహా లేకుండాముందడుగు వేయలేదన్నారు. సీనియర్ జర్నలిస్ట్ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ మినీ పోరాట స్ఫూర్తి గొప్పదని కొనియాడారు.తెలంగాణ నుంచి హైదరాబాద్ ను వేరు చేసే కుట్ర తయారవుతుందని దానిపట్ల అందరూ అప్రమత్తత తో ఉండాలని విజ్ఞప్తి చేశారు.ఆ కుట్రను ఎదుర్కొనడానికి తిరిగి ఉద్యమించడానికి సన్నద్ధం కావాలన్నారు. నిత్యం ప్రజల గురించి ఆలోచించే మనిషి మునీర్ అని జనం సాక్షి సంపాదకులు రహమాన్ అన్నారు.విస్తృతంగా అనేక సమస్యలపై వార్తాకథనాలు రాసినాడన్నారు.మునీర్ మానవతావాది మాత్రమే కాకుండా పీడితుల పక్షాన నిలిచిన వ్యక్తి అన్నారు .పుస్తక సంపాదకుడు మాదాసి రామ్మూర్తి మాట్లాడుతూ సింగరేణి ఉద్యమాలనుండి మునీర్ ను విడదీసి చూడలేమన్నారు.ప్రతీ సామాజిక ఉద్యమంలో మునీర్ తనదైన,చురుకైన పాత్ర పోషించాడన్నారు.సహా సంపాదకుడు వెంకట రావు మాట్లాడుతూ మునీర్ ఒక ఫినామినా అని అభివర్ణించారు. సమావేశంలో ట్రేడ్ యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కేంగర్లమల్లయ్య, గురజాల రవీందర్ రావు, హెచ్. రవీందర్ లు మాట్లాడగా చందర్ అధ్యక్షత వహించారు.

# మైదానంలో ఎంపీ సందడి..





**-ప్రజల మధ్య ఎంపీ వంశీకృష్ణ..**

**-చిన్నారులతో క్రికెట్..**

**-మైదానానికి 20 ట్రిప్పుల మట్టి..**

**-సమస్యలపై వెంటనే స్పందన..**

హంస కలం వార్త జూన్ 14 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు చేపట్టడమే తన లక్ష్యమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ మరోసారి చాటిచెప్పారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలో పర్యటించిన ఆయన యువత, చిన్నారులు, వ్యాపారులు, స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఉదయం హైటెక్ సిటీలోని బ్యాడ్మింటన్ మైదానంలో యువతతో కలిసి బ్యాడ్మింటన్ ఆడిన గడ్డం వంశీకృష్ణ, క్రీడల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం మంచిర్యాల బాలుర క్రీడా మైదానాన్ని సందర్శించి అక్కడ సాధన చేస్తున్న చిన్నారులతో క్రికెట్ ఆడారు. మైదానం అభివృద్ధి అంశంపై వెంటనే స్పందించిన ఆయన శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్తో ఫోన్‌లో మాట్లాడి మైదానం అభివృద్ధికి ఉపయోగపడేలా 20 ట్రిప్పుల మట్టిని అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే చిన్నారుల క్రీడా ప్రోత్సాహం కోసం రెండు క్రికెట్ కిట్లను అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మార్కెట్ ప్రాంతంలోని రత్నలాల్ హోటల్ వద్ద స్థానిక వ్యాపారులు, ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. మురుగునీటి కాలువలు, రహదారులు, వాహనాల నిలుపుదల స్థలాలు, తాగునీటి సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా హోటల్ యజమానులు, వ్యాపారులతో మాట్లాడిన గడ్డం వంశీకృష్ణ, వాణిజ్య అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సరఫరా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ సరఫరా సక్రమంగా జరుగుతోందా, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, ప్రజల సమస్యలే నా సమస్యలు. ప్రజల మధ్యే ఉంటూ వారి అవసరాలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడం నా బాధ్యత" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువత, క్రీడాకారులు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

## 12 వ డివిజన్ మానేరు డ్యామ్ సమీపంలో ఓపెన్ జిమ్ ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

( జూన్ - 14- హంస కలం వార్త )

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ మానేరు డ్యామ్ సమీపంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో, సీఎస్ఆర్ మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేయ డానికి ఈ జిమ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.నగర అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను అందించడంలో నగర పాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కి, సీఎస్ఆర్ మలయప్ప ఫౌండేషన్ ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ



కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు మానేరు వాకర్స్ సభ్యులు, నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి టీజీఎస్ ఆర్టీసీ సిద్ధం... రేపటి నుంచే ప్రత్యేక స్కూల్ బస్సులు..

**-పాఠశాలల పునఃప్రారంభం: విద్యార్థుల వేళలకు అనుగుణంగా అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు నడపాలి : ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశం**



( జూన్ - 14- హంస కలంవార్త )

వేసవి సెలవుల అనంతరం (జూన్ 15 సోమవారం) నుండి రాష్ట్రవ్యాప్తంగా 2026-27 విద్యాసంవత్సరానికి గాను పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి... ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా అన్ని రూట్లలో తగినన్ని స్కూల్ బస్సులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్ని రీజియన్ లఅధికారులను ఆదేశించారు. నూతన విద్యాసంవత్సరంలో మొత్తం 227 పనిదినాలు ఉన్నందున, విద్యార్థులు సకాలంలో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాలను సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని రీజియన్ల అధికారులు, డిపో మేనేజర్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి రవాణా ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఎండీ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల స్కూల్ టైమింగ్స్‌కు అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించాలని, గతంలో నడిపిన అన్ని స్కూల్ రూట్లను విధిగా పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు బస్సుల కోసం ఎక్కువ సమయం వేచి ఉండకుండా, ఉదయం మరియు సాయంత్రం వేళల్లో ఖచ్చితమైన సమయ పాలన పాటించాలని, అవసరమైన చోట అదనపు ట్రిప్పులు నడపాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఎండీ నాగిరెడ్డి ఆదేశించారు.

## 121 సార్లు రక్తదానం, ఘనంగా సన్మానం

**-లింగాల రవికుమార్ రక్తదానం అభినందనీయం.**

( జూన్ - 14- హంస కలంవార్త )



హైదరాబాద్ సిటీ, అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా దిశ లా ఫర్మ్ ఆధ్వర్యంలో రక్తదాతలను ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా శ్రీ సాయి ఫేమస్ ఉడిపి టిఫిన్స్ అధినేత లింగాల రవికుమార్‌ను, ఆయన సతీమణి వడ్డే శాంతి మహేశ్వరిని హైకోర్టు ప్రముఖ న్యాయవాది నాగేశ్వర్ రావు పూజారి సత్కరించి అభినందించారు. ఇప్పటి వరకు 121 సార్లు రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా రక్తదాత రవికుమార్ మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడమే అన్నారు. తాను ప్రతీ 3 నెలలకు ఒకసారి రక్తదానం చేస్తానని చెప్పారు. రక్తదానం చేయడం వల్ల నీరసం వస్తుందని కొందరు అపోహపడతారని, అలాంటిది ఏమీ ఉండదని వెల్లడించారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా లభించిన ఈ గుర్తింపు తమకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా రక్తదాన సేవలను కొనసాగిస్తామని దంపతులు రవికుమార్, శాంతి మహేశ్వరి తెలియజేశారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట- మంత్రి జూపల్లి

**-రూ.46 లక్షలతో నూతన భవనం ప్రారంభం..**

**-బజార్‌హత్నూర్ రూ.39 లక్షల భవనానికి శంకుస్థాపన**

( జూన్ - 14- హంస కలంవార్త )



జ్ఞాన సముపార్జనలో గ్రంథాలయాల పాత్ర కీలక మని, విద్యార్థులు, యువత వాటిని సద్వి నియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. శనివారం జిల్లాలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ ఆవరణలో రూ.46 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన మొదటి అంతస్తు భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో రూ. 39 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రంథాలయ భవనంలోని సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రంథాలయాలు సమాజానికి జ్ఞాన కేంద్రాలుగా నిలుస్తాయని, ప్రజల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు, గ్రంథాలయ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ అధికారులు, ప్రజాప్రతి నిధులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్ష బీభత్సం..రంగంలోకి మంత్రి వివేక్..

-మందమర్రిలో మంత్రి వివేక్ ఆకస్మిక పర్యటన..

-వర్ష నష్టాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన..

-బాధితులకు భరోసా.. అధికారులకు ఆదేశాలు..

-చెట్ల తొలగింపు, సహాయక చర్యలు వేగవంతం..



హంస కలం వార్త జూన్ 14 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మందమర్రి పట్టణంలో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి పడటం, విద్యాసంస్థలు, నివాస గృహాలకు నష్టం వాటిల్లడంతో బాధితుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ శనివారం మందమర్రిలోని వర్ష ప్రభావిత ప్రాంతాలను సందర్శించి నష్ట పరిస్థితులను పరిశీలించారు. పట్టణంలోని దీపక్‌నగర్, పాలచెట్టు రెండో జోన్ ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ నివాసం వద్ద జరిగిన ఆస్తి నష్టాన్ని పరిశీలించారు. అనంతరం సరస్వతి పాఠశాలపై భారీ చెట్లు కూలిపోవడంతో దెబ్బతిన్న భవన భాగాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. బాధితులతో నేరుగా మాట్లాడిన మంత్రి, జరిగిన నష్టం వివరాలను తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. వర్షాల కారణంగా ప్రభావితమైన ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించి ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన సహాయాన్ని అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని మంత్రి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు..

## ఖండ ఖండాలుగా విడిపోతున్న మేఘాలు

-బంగాళాఖాతంలో ద్రోణి బలహీనపడిన ఆవర్తనం

-రాగల 3 రోజులలో పలు జిల్లాల లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు




( జూన్ - 14- హంస కలంవార్త )

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం విడుదల చేసిన నివేదిక ప్రకారం నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి ప్రస్తుతం హర్నై, సోలాపూర్ మీదుగా తెలంగాణలోని హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, అటుపై కళింగపట్నం, పారాదీప్, ముజఫర్‌పూర్ మీదుగా కొనసాగుతోంది. రాబోయే 4 నుంచి 5 రోజులలో తెలంగాణలోని మిగిలిన ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, బీహార్,దక్షిణఛత్తీస్‌గఢ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు

-బంగాళాఖాతంలో ద్రోణి బలహీనపడిన ఆవర్తనం

ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌కు ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి నైరుతి బంగాళాఖాతం మీదుగా దక్షిణ తమిళనాడు వరకు, సముద్ర మట్టానికి 3.1 నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తు మధ్య ఒక ద్రోణి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోకి తగినంత తేమ గాలులు వీస్తున్నాయి. మరోవైపు, దక్షిణ తెలంగాణ పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలహీనపడినట్లు వాతావరణ కేంద్రం విశ్లేషించింది.

-రాగల 3 రోజులలో పలు జిల్లాల లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

రాగల 3 రోజుల వాతావరణ సూచన ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వాతావరణం చల్లబడనుంది. ఈరోజు (ఆదివారం), రేపు (సోమవారం), ఎల్లుండి (మంగళవారం) రాష్ట్రంలోని పలు జిల్లాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక ఉష్ణోగ్రతల విషయానికి వస్తే రాష్ట్రంలో గరిష్టఉష్ణోగ్రతలలో రానున్న మూడు రోజులలో పెద్దగా మార్పులు ఏమీ ఉండవని, ఎండల తీవ్రత తగ్గి సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ ఫోకస్..

-ఓటర్ల హక్కుల పరిరక్షణే లక్ష్యం..

-అర్హుల పేరు తొలగిస్తే వెంటనే స్పందన..

-ఇంటింటా ఓటర్ల వివరాల ధృవీకరణ..

-బూత్ స్థాయి ప్రతినిధులకు ఎంపీ దిశానిర్దేశం..

హంస కలం వార్త జూన్ 14 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి.ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల జాబితా పరిశుద్ధత అత్యంత కీలకమని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పిలుపు నిచ్చారు. మంచిర్యాల పట్టణంలోని పద్మావతి గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ నాయకుల కోసం నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అవగాహన శిక్షణ సమావేశంలో ఆయన పాల్గొని మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటర్ల జాబితా ఖచ్చితత్వం ఎంతో అవసరమని, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే వలసలు, మరణాలు, చిరునామా మార్పులు వంటి వివరాలను సేకరించి ఎన్నికల అధికారులకు అందించాలని తెలిపారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజల ఓటు హక్కులను పరిరక్షించడంలో కాంగ్రెస్ శ్రేణులు ముందుండాలని ఆయన అన్నారు. ఎక్కడైనా అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రయత్నాలు జరిగితే వెంటనే గుర్తించి స్పందించాలని సూచించారు. బూత్ స్థాయి ప్రతినిధులే పార్టీకి, ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముకలని పేర్కొన్న గడ్డం వంశీకృష్ణ, నమోదు దరఖాస్తు, పేరు తొలగింపు, వివరాల సవరణ




ప్రక్రియలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు కూడా వాటి గురించి వివరించాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతో పాటు పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, జాతీయ విద్యార్థి సంఘం, సేవాదళ్, మహిళా కాంగ్రెస్ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# మునీర్ మార్గంలో సింగరేణి రక్షణ..

-మునీర్ పేరు మార్మోగిన సభ..

-సింగరేణి రక్షణకు కట్టుబాటు..

-కార్మికులకే తొలి ప్రాధాన్యం..

-ఉద్యమ యోధుడికి ఘన వందనం..

హంస కలం వార్త జ14 జూన్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్

సింగరేణి కార్మిక ఉద్యమాలు, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం, ప్రజా సమస్యలపై నిరంతరం కలంతో పోరాడిన సీనియర్ జర్నలిస్ట్ మునీర్ సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన 'మునీర్ భాయ్' పుస్తకావిష్కరణ సభ ఆదివారం మందమర్రిలో భావోద్వేగభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. సింగరేణి పరిరక్షణలో మునీర్ పోషించిన పాత్ర, తెలంగాణ ఉద్యమానికి అందించిన సేవలు, కార్మికుల హక్కుల కోసం సాగించిన నిరంతర పోరాటం సభలో ప్రధాన చర్చనీయాంశాలుగా నిలిచాయి. రాజకీయ, సామాజిక, కార్మిక, జర్నలిస్టు రంగాలకు చెందిన ప్రముఖులు ఒకే వేదికపై చేరి మునీర్ సేవలను కొనియాడారు. కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య ఆవిష్కర్తగా పాల్గొని మాట్లాడుతూ, సింగరేణి సంస్థను పరిరక్షించే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. గతంలో సింగరేణి అనారోగ్య పరిశ్రమగా మారి సంక్షోభంలో చిక్కుకున్న సమయంలో తన తండ్రి కాకా వెంకటస్వామి కీలక పాత్ర పోషించి సంస్థను కాపాడారని గుర్తు చేశారు. అదే సమయంలో మునీర్ తన వార్తలు, విశ్లేషణల ద్వారా సింగరేణి పరిరక్షణకు మార్గనిర్దేశం చేశారని కొనియాడారు. మునీర్ స్ఫూర్తితోనే సింగరేణి భవిష్యత్తు కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చిన మంత్రి, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర విశిష్టమైందని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిర్భయంగా నిలబడిన జర్నలిస్టుగా మునీర్ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. మునీర్ పేరిట ప్రెస్ భవనం, విగ్రహ ప్రతిష్ఠాపన కోసం స్థలం కేటాయింపుపై సింగరేణి యాజమాన్యంతో చర్చిస్తానని తెలిపారు. ఆయన కుటుంబానికి పెన్షన్ మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శాసన మండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, మునీర్ జీవిత చరిత్ర తెలంగాణ సమాజానికి మార్గదర్శక గ్రంథమని పేర్కొన్నారు. తెలంగాణ తత్వం, ఉద్యమ చరిత్ర, సామాజిక బాధ్యతలను అర్థం చేసుకోవాలంటే ఈ పుస్తకం చదవాలని సూచించారు. ఐదు దశాబ్దాల బొగ్గుబెల్ట్ ఉద్యమాల చరిత్రను ఈ గ్రంథం భవిష్యత్ తరాలకు అందిస్తుందని అన్నారు. సీనియర్ సంపాదకుడు రామచంద్రమూర్తి మాట్లాడుతూ, మునీర్ సాహసోపేత జర్నలిస్టుగా ప్రజా సమస్యలను సమాజం ముందుంచిన వ్యక్తి అని అన్నారు. సింగరేణి ప్రాంత ప్రజల సమస్యలను రాష్ట్రవ్యాప్తంగా చర్చకు తీసుకురావడంలో ఆయన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. తెలంగాణ మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు మాట్లాడుతూ, మునీర్ తనకు స్నేహితుడు మాత్రమే కాదని, జీవిత ప్రయాణంలో మార్గ దర్శకుడని అన్నారు. ఆయన సలహాలు ఎన్నో సందర్భాల్లో తనకు బలాన్ని ఇచ్చాయని గుర్తుచేశారు. సీనియర్ జర్నలిస్ట్ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ, మునీర్ పోరాట స్ఫూర్తి తెలంగాణ సమాజానికి శాశ్వత ప్రేరణ అని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. జనం సాక్షి సంపాదకుడు రహమాన్ మాట్లాడుతూ, ప్రజల కష్టాలు, కార్మికుల బాధలు, పీడితుల సమస్యలే మునీర్ జీవిత లక్ష్యమని అన్నారు. మానవతా విలువలకు కట్టుబడి పనిచేసిన అరుదైన జర్నలిస్టుగా ఆయన గుర్తుండిపోతారని పేర్కొన్నారు. పుస్తక సంపాదకుడు మాదాసి రామ్మూర్తి



మాట్లాడుతూ, సింగరేణి ఉద్యమాల చరిత్రలో మునీర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ప్రతి సామాజిక ఉద్యమంలో ఆయన చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. సహ సంపాదకుడు వెంకటరావు మాట్లాడుతూ, మునీర్ ఒక వ్యక్తి కాదు, ఒక ఉద్యమం అని అభివర్ణించారు. సమాజ మార్పు కోసం కలాన్ని ఆయుధంగా మలచుకున్న యోధుడిగా ఆయన నిలిచిపోయారని అన్నారు. ట్రేడ్ యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కేంగర్ల మల్లయ్య, గురజాల రవీందర్ రావు, హెచ్. రవీందర్ మునీర్ సేవలను స్మరించుకుని నివాళులర్పించారు. సభకు చందర్ అధ్యక్షత వహించారు.. మునీర్ జీవిత ప్రయాణం ఒక జర్నలిస్టు కథ మాత్రమే కాదని, అది సింగరేణి కార్మికుల పోరాట గాథ, తెలంగాణ ఆత్మగౌరవ ఉద్యమ చరిత్ర, పీడిత ప్రజల పక్షాన నిలిచిన కలం యోధుడి ప్రస్థానమని సభలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నిజాయితీ, నిబద్ధత, ప్రజా సంక్షేమం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన మునీర్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, తెలంగాణ విలువల కాపాడటంలో మునీర్ చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొంటూ సభ ఘనంగా ముగిసింది.

# ప్రభుత్వ బడుల విద్యార్థుల జయకేతనం

-బాసర ట్రిపుల్ ఐటీలో 65 మందికి సీట్లు

-ప్రతిభావంతులను అభినందించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

( జూన్ - 14- హంస కలంవార్త )

నాణ్యమైన విద్యకు ప్రభుత్వ పాఠశాలలు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. బాసర ట్రిపుల్ ఐటీ (ఆర్‌జీయూకేటీ) ప్రవేశాల్లో ఆదిలాబాద్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాకు చెందిన మొత్తం 65 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల మొదటి విడతలో 58 మంది, తాజాగా విడుదలైన రెండో విడతలో ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్న విద్యార్థులు ఈ ఘనత సాధించడం విశేషమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందిస్తూ,వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ప్రత్యేకంగా ప్రశంసించారు.కష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాలల నుంచే ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించవచ్చని ఈ ఫలితాలు నిరూపించాయని తెలిపారు.

-ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు

ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని కలెక్టర్ తెలిపారు. సోమవారం (జూన్ 15) నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నాయని పేర్కొన్నారు.



-ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు

విశాలమైన తరగతి గదులు,స్వచ్ఛమైన తాగునీరు,ఆధునిక మరుగుదొడ్లు,డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు. పోషకాహారంతో కూడిన ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం. విద్యార్థుల ందరికీ ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ. ఖాన్ అకాడమీ,ఫిజిక్స్ వాలా వంటి వేదికల ద్వారా నాణ్యమైన డిజిటల్ బోధన. ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీలు) ద్వారా ఆధునిక సాంకేతిక బోధన. శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థి కేంద్రిత అభ్యాస వాతావరణం. ప్రభుత్వ పాఠశాలలు నేడు నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, మెరుగైన ఫలితాలతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయని, ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# 91 రక్తదాన శిబిరాలలో సేకరించిన అత్యధిక 6016 యూనిట్లకు ఇండియన్ రెడ్ మంచిర్యాల

హంస కలం వార్త జ14 జూన్

ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోక్ భవన్ సంస్కృతి కమ్యూనిటి హాల్ లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతులమీదుగా రెడ్ క్రాస్ వివిధ జిల్లా శాఖల సభ్యులకు అవార్డు అందచేయడం చేయడం జరిగింది.మొదట వ్యక్తిగతంగా అత్యధిక 1101 మంది రక్తదాతలను సమకూర్చిన విభాగంలో కీ.శే.కొక్కిరాల రఘుపతి రావు ఛారిటబుల్ ట్రస్ట్ మంచిర్యాలకు సంస్థ అవార్డును కొక్కిరాల చరణ్ రావు కి,సంస్థ పరంగా అత్యధిక 246 మంది రక్తదాతలను సమకూర్చిన విభాగంలో సింగరేణి పవర్ ప్లాంట్, జైపూర్ సంస్థకు అందించిన అవార్డును డి.పంతుల డి జి ఎమ్ (ఈ ఒఎమ్)కి స్వచ్ఛంద రక్త దాతలు,స్వచ్ఛంద సేవా సంస్థలు ద్వారా నిర్వహించిన 91 రక్తదాన శిబిరాలలో సేకరించిన అత్యధిక 6016 యూనిట్లకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల రక్త నిధి కేంద్రం తెలంగాణ రాష్ట్రం లోనే అత్యధిక రక్త నిలువలు సేకరించడంలో రెండవ స్థాయి అవార్డును అందించడం జరిగింది.ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల జిల్లా శాఖ జిల్లా ఛైర్మన్ కంకణాల భాస్కర్ రెడీ, స్టేట్ ఎమ్ సి మెంబర్ వి మధుసూదన్ రెడ్డి,జిల్లా కార్యదర్శి చందూరి మహేందర్,ఎడ్ల కిషన్, కాసర్ల శ్రీనివాస్,సురభి శరత్ రావు, చుంచు శంకర్ వర్మ, తలస్సెమియా వెల్ఫేర్ సొసైటి జనరల్ సెక్రెటరీ కాసర్ల రంజిత్ లకు అవార్డు ప్రదానం చేయడం జరిగింది. రక్త నిలువలు సమకూర్చడంలో మరియు రక్త హీనతలో బాధపడుతున్న వారి ప్రాణాలు కాపాడటంలో ఎంతగానో కృషి చేసినటువంటి స్వచ్ఛంద రక్త దాతలకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు, రక్తదాన శిబిరాల నిర్వాహకులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల జిల్లా ఛైర్మన్ కంకణాల



భాస్కర్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ ఈ అవార్డు వారికి చెందుతుందని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల జిల్లా ఛైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి,స్టేట్ ఎమ్ సిమెంబర్ వి మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చందూరి మహేందర్,కాసర్ల శ్రీనివాస్,ఎడ్ల కిషన్ సురభి శరత్ రావు, చుంచు శంకర్ వర్మ, తల సేమియా వెల్ఫేర్ సొసైటి జనరల్ సెక్రెటరీ కాసర్ల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భీమ్‌గల్ అభివృద్ధిపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

( జూన్ - 14- హంస కలంవార్త )



భీమ్‌గల్ లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరై చేపట్టిన, ప్రస్తుతం అర్ధాంతరంగా నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులపై బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు.భీమ్‌గల్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించి గత ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరై 75 శాతం పనులు పూర్తి చేయగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండున్నర ఏండ్ల నుండి 25 శాతం పనులు కుడా చేయకుండా ఆగిపోయిన 100 పడకల హాస్పిటల్, ఇంటిగ్రెటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ పనులు పరిశీలించారు. మున్సిపల్ ఎలక్షన్ ముందర ఓట్లకోసం కాంగ్రెస్ ప్రభుత్వం భీంగల్ మున్సిపాలిటీ లో కంకర పోసి వదిలేసిన రోడ్లను, కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన బస్ డిపోను ఎమ్మెల్యే పరిశీలించారు.అనంతరం భీంగల్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని, కాంగ్రెస్ నాయకుల అబద్ధపు హామీలను ఆయన తీవ్రస్థాయిలో ఎండగట్టారు. భీమ్‌గల్ మరియు చుట్టుపక్కల మండలాల పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం స్థానికంగానే అందాలనే సంకల్పంతో, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావులను ఒప్పించి రూ. 35 కోట్లతో 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించానని ఎమ్మెల్యే వేముల గుర్తుచేశారు. ఇందులో రూ. 22 కోట్లు బిల్డింగ్ నిర్మాణానికి, రూ. 5 కోట్లు వైద్య పరికరాల కొనుగోలుకు, రూ. 8 కోట్లు పన్నుల నిమిత్తం కేటాయించడం జరిగిందన్నారు. కేవలం ఏడాది కాలంలోనే తాము అధికారంలో ఉండగా 16 కోట్లతో 75 శాతం బిల్డింగ్ పనులను పూర్తి చేసి, కాంట్రాక్టర్‌కు రూ. 13 కోట్ల బిల్లులు కూడా ఇప్పించామని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భీమ్‌గల్ ప్రజలను మభ్యపెడుతూ తమను గెలిపిస్తే మూడు నెలల్లో రూ. 5 కోట్లు ఇప్పించి ఆసుపత్రిని తెరిపిస్తామని అబద్ధపు హామీలు ఇచ్చారని ధ్వజమెత్తారు. ఫిబ్రవరి 14న ఎన్నికల ఫలితాలు వచ్చి ఇప్పటికే నాలుగు నెలలు కావచ్చినా (జూన్ 14) మిగిలిన 25 శాతం పనులను పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాగే మహేష్ కుమార్ గౌడ్ కూడా మాట తప్పారని విమర్శించారు. ఇప్పటికైనా వంద పడకల ఆసుపత్రిని పూర్తి చేయడానికి జూలై 14 వరకు మరో నెల రోజులు గడువు ఇస్తున్నామని, ఆలోగా ఆసుపత్రిని ప్రారంభించకుంటే భీంగల్ లో మహేష్ కుమార్ గౌడ్‌ను, కాంగ్రెస్ నాయకులను ప్రజలు తిరగనివ్వరని నిలాదీస్తారని, అడ్డుకుంటారని హెచ్చరించారు. భీమ్‌గల్ పట్టణం లో పాత తహసీల్దార్ ఆఫీస్ స్థలంలో రూ. 3 కోట్లతో 108 దుకాణాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని గత ప్రభుత్వంలోనే ప్రారంభించామని, తమ హయాంలోనే రూ. 2 కోట్ల పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపాలిటీకి శాశ్వత ఆదాయం వచ్చేలా అదే ప్రాంగణంలో మెయిన్ రోడ్డుపై మరో రూ. 3 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి, మొత్తంగా రూ. 7 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ. 90 లక్షల బిల్లులు చెల్లించకపోవడంతో రెండున్నర సంవత్సరాలుగా పనులు పూర్తిగా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆర్టీసీ మాజీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో రూ. 2.10 కోట్లతో మూతపడ్డ భీమ్‌గల్ బస్ డిపోను ఆధునీకరించి, తాము అధికారంలో ఉన్నప్పుడు ఆరు నెలల పాటు విజయవంతంగా నడిపించామని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో బస్ డిపోను పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు, నేటికి ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో తాము భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో మిగిలిపోయిన సీసీ రోడ్ల కోసం రూ. 10 కోట్లు, ఫంక్షన్ హాల్ కోసం రూ. 1.5 కోట్లు.. మొత్తంగా రూ. 11.5 కోట్లు మంజూరు చేయించామని వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో మంత్రి సీతక్క చేత హడా వుడిగా కొబ్బరికాయలు కొట్టించి, కంకర పోయించిన కాంగ్రెస్ నాయకులు, ఆరు నెలలవు తున్నా ఆ రోడ్లను పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. బడా భీమ్‌గల్ బ్రిడ్జి, రోడ్డు వరదలకు కొట్టుకుపోయి ఏడాది దాటుతున్నా కనీస మరమ్మతులు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోందన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు మంజూరు చేసిన బడ్జెట్ నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ..మిగిలిన 25 శాతం పనులను కుడా పూర్తి చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఓడినా గెలిచినా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటుంది, ప్రజల కోసమే పోరాడుతుంది" అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఉపాధి కూలీలకు నష్టం చేసే చర్యలను ఉపసంహరించుకోవాలి..

-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

( జూన్ - 14- హంస కలంవార్త )



ఖమ్మం అర్బన్: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వి బి జీ రాం జీగా పేరుమార్చి వ్యవసాయ కార్మికులకు నష్టం చేకూరిస్తే మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ హెచ్చరించారు. ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన -జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దండి సురేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి -వేస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక చర్యలను తిప్పికొట్టే వరకు ఉద్యమించాలన్నారు. యుపిఏ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ సాధించిన వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే ఎంజిఎన్ఆర్జిఏ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. పేద ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను హరించివేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందన్నారు. దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా చైతన్యవంతమైన పోరాటాలకు సిద్ధం కావాలని - సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ -ఇండ్లుకట్టించి ఇవ్వాలని, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న జరిగే కలెక్టరేట్ వద్ద ధర్నాను =జయప్రదం చేయాలని కోరారు. విబి జీ రాంజీ చట్టాన్ని రద్దు చేసి ఎంజిఎన్ఆర్ఆజిఏ చట్టాన్ని కొనసాగించాలని, 200 రోజులు పని కల్పించాలని, 55 ఏళ్ల నిండిన వ్యవసాయ కార్మికులకు ఆరువేల ప్రభుత్వ పెన్షన్ ఇవ్వాలని, మహాలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు -నెలకు రూ.2500 ఇవ్వాలని తదితర డిమాండ్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిర్వహించే ధర్నాలో వ్యవసాయ కార్మికులు అధిక -సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసు, జిల్లా ఆఫీస్ బేరర్స్ మేళ్లచెరువు వీరబాబు, సింగారపు - సత్యనారాయణ, పిట్టల రాంబాబు, అయోధ్య, గోగుల ఆది తదితరులు పాల్గొన్నారు.

# వర్షంలో రైతుల దగ్గరికి జిల్లా కలెక్టర్

-వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

-రైతులు అధైర్యపడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది

-జిల్లాలో యూరియా కొరత లేకుండా ఆన్‌లైన్ విధానంలో సరఫరా చేస్తాం

-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



హంస కలం వార్త జ14 జూన్

అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని పెద్దాపూర్, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఇటీవల జిల్లాలో కురిసిన అకాల భారీ వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం పరిస్థితిని స్వయంగా పరిశీలించిన కలెక్టర్, రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శనివారం కురిసిన భారీ వర్షాలకు వరి ధాన్యం తడిసిన విషయం తన దృష్టికి వచ్చినందున కొనుగోలు కేంద్రాలను ప్రత్యక్షంగా సందర్శించినట్లు కలెక్టర్ తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఎక్కువ కాలం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా వెంటనే బాయిల్ మిల్లులకు తరలించాలని, ఇందుకోసం రవాణా ఏర్పాట్లను వేగవంతం చేయాలని సివిల్ సప్లైస్, ఐకేపీ, మెప్మా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ధాన్యం నిల్వలు, తేమ శాతం, తూకం ప్రక్రియ, హమాలీల ఏర్పాటు, రవాణా సదుపాయాలు, రైతులకు అందిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాల కారణంగా ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటు చేసి ధాన్యాన్ని రక్షించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం రైతులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ధాన్యం తడవడం, కొనుగోలు ప్రక్రియ ఆలస్యమవుతుందనే ఆందోళన రైతుల్లో కనిపించడంతో వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతుల శ్రమ వృథా కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు, జాప్యాలు జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కువసేపు వేచి ఉండకుండా వేగవంతంగా తూకాలు నిర్వహించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే బాయిలర్ మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులకు చెల్లింపులు కూడా సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు ఈ వర్షాకాల సాగు సీజన్‌కు అవసరమైన యూరియా ఎరువుల లభ్యతపై కోరత లేకుండా చూడాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో యూరియా కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈసారి ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. రైతుల విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లాలో యూరియా కొరత తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ విధానంలోనే యూరియా పంపిణీ జరిగేలా వ్యవసాయ శాఖ ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. అవసరమైన నిల్వలను ముందుగానే సమకూర్చి ప్రతి రైతుకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగు సలహాలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ సూచించారు. ఈ వర్షాకాల వ్యవసాయ సీజన్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, రైతులకు అవసరమైన సేవలు గ్రామ స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ౖతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహా రావు, ఉప్పునుంతల మండలం తాహసిల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, సివిల్ సప్లైస్ శాఖ, ఐకేపీ, మెప్మా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు ఉన్నారు.

# బిజినెస్

## టాటా ఫ్యాక్టరీకి టిఎన్‌పిసిబి షాక్

-ఐఫోన్ విడిభాగాల యూనిట్‌కు నోటీసులు





హోసూర్: ఆపిల్ ఐఫోన్ విడిభాగాలను తయారు చేసే ప్రముఖ దేశీయ సంస్థ టాటా ఎలక్ట్రానిక్స్ కు తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు (టిఎన్‌పిసిబి) గట్టి షాక్ ఇచ్చింది. తమిళనాడులోని హోసూర్‌లో ఉన్న ఈ ప్లాంట్ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాల వల్ల సమీపంలోని వ్యవసాయ భూములు, బావుల్లోని భూగర్భ జలాలు కలుషితమవు తున్నాయనే ఆరోపణలపై సంస్థకు హెచ్చరిక నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై మే 25 నాటి నోటీసుకు సరైన వివరణ ఇవ్వకుంటే ఫ్యాక్టరీని మూసివేయడంతో పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని స్పష్టం చేసింది. చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునే వ్యూహంలో భాగంగా భారతదేశంలో ఆపిల్ సరఫరా గొలుసులో తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ తర్వాత టాటా ఎలక్ట్రానిక్స్ రెండవ అతిపెద్ద భాగస్వామిగా ఉన్న తరుణంలో ఈ నోటీసులు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న రసాయన వ్యర్థ జలాల వల్ల తమ పంట పొలాలు, బావులు కలుషితం అవుతున్నా యంటూ స్థానిక రైతులు గత కొన్ని నెలలుగా చేసిన ఫిర్యాదుల ఆధారంగా అధికారులు డిసెంబర్ 2025 నుండి మే 2026 మధ్య కాలంలో ఐదుసార్లు ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. ఈ ఫ్యాక్టరీతో వ్యవసాయ భూముల్లోని బావుల్లో భూగర్భ జలాలు కలుషితమ య్యాయని కాలుష్య మండలి నిర్ధారించింది.

## 'హెల్తీ' పేర్లపై ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ కొరడా.. ఆ 8 బ్రాండ్లకు నోటీసులు

ఇంటర్నెట్ డెస్క్:

నెస్లే ఇండియా సంస్థకు చెందిన మ్యాగీ న్యూడుల్స్‌లో పురుగులు ఉన్నాయంటూ ఇటీవల విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థఅప్రమత్తమై నెస్లేను వివరణ కోరడం సహా.. ఆహార ఉత్పత్తులపై వినియోగదారులను తప్పుదారి పట్టించేలా ఉన్న వాణిజ్య, బ్రాండ్ పేర్లు, ఆరోగ్య సంబంధిత ప్రకటనలపైచర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలో తాజాగా 8 ఆహార, వ్యాపార సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఎక్స్ మీడియా వేదికగా వెల్లడించింది.ఎమామి హెల్తీ అండ్ టేస్టీ, హెల్త్ ఎయిడ్, ట్రూవీ, ది హెల్తీ ఫ్యాక్టరీ, హెల్తీ మాస్టర్, హెల్తీ ఛాయిస్, ప్లాన్ బీ, న్యూహెర్బ్సులకు సదరు నోటీసులు పంపినట్టు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ పేర్కొంది. ఎమామీ హెల్తీ, ట్రూ విటమిన్, వీగన్ వంటి పేర్లతో వినియోగదారుల్లో ఉత్పత్తులపై ప్రత్యేక ఆరోగ్య ప్రయోజనాల భావన కలిగిస్తున్నారనే ఆరోపణలతో ఈ చర్యలకు ఉపక్రమించినట్టు స్పష్టం చేసింది. సదరు సంస్థలు ఆహార భద్రతా ప్రమాణాల చట్టం-2006 నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమి కంగా గుర్తించామని తెలిపింది. ఇటీవల మార్కెట్లోకి వచ్చిన పలు ఆహార ఉత్పత్తులు, బ్రాండ్లు, ప్రచార వాదనలపై ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎమామి గ్రూప్‌నకు చెందిన హెల్తీ అండ్ టేస్టీ వంట నూనెల బ్రాండ్ పేరు, ప్లాన్ బీ సంస్థ వీగన్ అనుమతులు లేకుండానే చేస్తున్న ప్రచారం, ది హెల్తీ ఫ్యాక్టరీ జీరో మైదా ఉత్పత్తుల వాదనలు, న్యూ హెర్బ్స్ విక్రయిస్తున్న ట్రూ విటమిన్‌లపై అనుమానాలు లేవనెత్తింది. అలాగే ట్రూవీ, హెల్తీ మాస్టర్, హెల్తీ ఛాయిస్, హెల్త్ ఎయిడ్ వంటి సంస్థలు ఉపయోగిస్తున్న హెల్తీ పేరుతో కూడిన బ్రాండ్ పేర్లు, ట్యాగ్‌లైన్లు వినియోగదారులను తప్పుదారి పట్టించే అవకాశముందని పేర్కొంది. ఈ పేర్లు, వాదనలు, ప్రచార విధానాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయనే అంశంపై పరిశీలిస్తున్నట్టు స్పష్టం చేసింది. కాగా.. ఇటీవలే సోషల్ మీడియాలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నెస్లే ఇండియా(మ్యాగీ), కేఎఫ్‌సీ, ఫ్లిప్‌కార్ట్, ఓపెన్ సీక్రెట్ సంస్థలకూ ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. వినియోగదారులకు సరైన సమాచారం అందేలా చూడటం, తప్పుడు లేదా బూటకపు ఆరోగ్య వాదనలను అరికట్టడం తమ ప్రధాన లక్ష్యమని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ స్పష్టం చేసింది.




## మరింత ఎక్కువగా రష్యా చమురు.. మేలో గణనీయంగా పెరిగిన దిగుమతులు

రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు దిగుమతులు మే నెలలో గణనీయంగా పెరిగాయి. మే నెలలో రష్యా నుంచి మొత్తంగా 5.8 బిలియన్ యూరోల విలువైన చమురు, బొగ్గును భారత్ కొనుగోలు చేసినట్టు ఐరోపాకు చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఎనర్జీ అండ్ క్లీన్ నివేదిక వెల్లడించింది. మే నెలలో రష్యా నుంచి అత్యధిక చమురును కొనుగోలు చేసిన రెండో దేశంగా భారత్ నిలిచింది ఏప్రిల్ నెలతో పోల్చితే మే నెలలో రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు 21 శాతం మేర పెరిగాయి. వడినార్ రిఫైనరీ కొనుగోళ్లు 36 శాతం, జామ్‌నగర్ రిఫైనరీ కొనుగోళ్లు 14 శాతం వృద్ధి చెందాయి. ఇక, ప్రభుత్వ రంగ చమురు కర్మాగారాలు కూడా రష్యా ముడిచమురు దిగుమతులను గణనీయంగా పెంచాయి. గతేడాది నవంబర్ నుంచి రష్యా చమురు దిగుమతులను నిలిపివేసిన న్యూ మంగుళూరు, విశాఖపట్నం రిఫైనరీలు ఈ ఏడాది మార్చి నుంచి తిరిగి మొదలుపెట్టాయి. మే నెలలో భారీగా పెంచాయి. ఇక, రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తున్న భారత్, తుర్కియే, బ్రూనై, జార్జియా.. ఇతర దేశాలకు 641 మిలియన్ యూరోల విలువైన చమురును ఎగుమతి చేశాయి. ఐరోపా, ఆస్ట్రేలియా, అమెరికా, న్యూజిలాండ్ దేశాలు ఈ చమురును దిగుమతి చేసుకున్నాయి.




రిలయన్స్‌కు చెందిన జామ్‌నగర్ రిఫైనరీ నుంచి అమెరికాకు ముడి చమురు ఎగుమతి జరిగింది.

## నా సెంచరీ క్రెడిట్ గంభీర్‌కే దక్కుతుంది: గుర్బాజ్



ఇంటర్నెట్ డెస్క్:

భారత్‌తో ధర్మశాలలో జరిగిన తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ జట్టు ఓడిన సంగతి తెలిసిందే. వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో.. అఫ్గాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ అద్భుతమైన సెంచరీతో అదరగొట్టాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. 51 బంతుల్లో 102 పరుగులు చేశాడు. అయితే తన ఇన్నింగ్స్‌పై గుర్బాజ్ తాజాగా స్పందించాడు. ఆ ఆటపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూచనలు ప్రభావం చూపాయని వెల్లడించాడు.ఇలాంటి అద్భుత ఇన్నింగ్స్ ఆడినందుకు ఆనందంగా ఉంది. వ్యక్తిగతంగా నా ఆటతీరు చాలా మెరుగైంది. అందుకోసం నెట్స్‌లో తీవ్రంగా శ్రమించా. అయితే ఈ ఇన్నింగ్స్‌కు క్రెడిట్ మాత్రం గంభీర్‌కే దక్కుతుంది. టెస్టు మ్యాచ్ ముగిసిన తర్వాత ఆయనతో చాలాసేపు మాట్లాడా. అది నా ఆటతీరును మెరుగుపర్చుకోవడంలో చాలా సాయం చేసింది. షాట్ల ఎంపికపై ఆయన నాకు విలువైన సూచనలు చేశారు. నెట్స్‌లో అదే ప్రాక్టీస్ చేశా. ఇప్పుడు ఫలితం వచ్చింది. అందుకే గంభీర్ సర్‌కు కృతజ్ఞతలు చెబుతున్నా. పిచ్ చాలా క్లిష్టంగా ఉంది. స్పిన్‌ను ఆడటం అంత తేలికైన విషయం కాదు. స్పిన్నర్లకు కాస్త టర్న్‌తోపాటు సహకారం లభించింది. నేను మాత్రం పాజిటివ్‌గా ఆడా. కానీ జట్టు ఓడిపోవడంతో చాలా నిరాశకు గురయ్యా' అని గుర్బాజ్ తెలిపాడు.




# స్పోర్ట్స్

## ఆర్చరీ ప్రపంచ కప్: భారత్‌కు స్వర్ణం




ఇంటర్నెట్ డెస్క్:

ఆర్చరీ ప్రపంచ కప్‌లో భారత్ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. తుర్కియేలో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3 పోటీలో భారత్ స్వర్ణం గెలుచుకుంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు చెందిన ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మొహోద్.. ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ అయిన దక్షిణ కొరియాను వరుస సెట్లలో ఓడించారు. దక్షిణ కొరియాకు చెందిన ఓహ్ యే-జిన్, కిమ్ జె-డివోక్‌పై 5-1 తేడాతో విజయం సాధించారు. నాలుగేళ్ల తర్వాత భారత్ వరల్డ్ కప్ స్టేజ్‌లో ఈ విభాగంలో బంగారు పతకం సాధించింది. చివరిసారిగా 2022 ఈవెంట్‌లో రిధి ఫోర్ - తరుణ్‌దీప్ రాయ్ జోడీ గోల్డ్‌ను గెలుచుకుంది. తొలి సెట్ నుంచే ఆధిక్యం సాధించిన భారత జోడీ.. కీలక సమయాల్లో ఒత్తిడిని అధిగమిస్తూ అద్భుత ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా చివరి దశలో ధీరజ్ వరుసగా రెండు పర్ఫెక్ట్ 10లు కొట్టడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. అతడి గురి దక్షిణ కొరియాకు అవకాశమే ఇవ్వకుండా భారత్‌కు స్వర్ణ పతకాన్ని ఖాయం చేసింది. తొలి రెండు రౌండ్లలో 37-36, 37-36తో భారత్‌దే ఆధిపత్యం. ఇక మూడో రౌండ్‌లోనూ పోటాపోటీగా జరిగినా.. 39-39తో ఇరు జట్లూ సమంగా నిలిచాయి. దీంతో భారత్ విజేతగా అవతరించింది. ధీరజ్, కుంకుమ్‌లకు మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఇది తొలి ప్రపంచకప్ స్వర్ణ పతకం కావడం విశేషం. ప్రస్తుతం భారత అగ్రశ్రేణి ఆర్చర్‌గా కొనసాగుతున్న ధీరజ్ వ్యక్తిగత విభాగంలోనూ పతక పోటీలో నిలిచాడు. మరోవైపు 17 ఏళ్ల కుంకుమ్ మొహోద్ అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను మరోసారి నిరూపించుకుంది. ఈ ఏడాది షాంఘై ప్రపంచకప్ స్టేజ్-2లో భారత మహిళల రికర్వ్ జట్టుతో కలిసి ఆమె ఇప్పటికే స్వర్ణ పతకం గెలిచింది.

## మరికొన్ని గంటల్లో భారత్‌తో మ్యాచ్‌కు.. పాకిస్థాన్‌కు బిగ్ షాక్

స్పోర్ట్స్ డెస్క్:

మహిళా టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇవాళ(ఆదివారం) హైవోల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా గ్రూపు-ఎ మ్యాచ్‌లో భాగంగా దాయాదీ దేశాలైన భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. రాత్రి 7:00 మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలోనే పాక్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. నిన్న(శనివారం) ఆ జట్టు కెప్టెన్ ఫాతిమా సనా గాయపడింది.ప్రాక్టీస్ సెషన్‌లో భాగంగా బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా, యువ బ్యాటర్ ఆయేషా జాఫర్ కొట్టిన షాట్ నేరుగా ఫాతిమా సనా కుడి మోకాలికి తగిలింది. దీంతో ఆమె తీవ్రమైన నొప్పితో నేలపై పడి విలవిల్లాడింది. వెంటనే ఫిజియో వచ్చి సనాకు చికిత్స అందించాడు. కాసేపటి తర్వాత ప్రాకిస్ట్ చేయకుండానే ఆమె నెట్స్ నుంచి వెళ్లిపోయింది. ఫాతిమా తిరిగి ప్రాక్టీస్‌కు రాలేదు. కానీ దాదాపు గంట తర్వాత ఫాతిమా అటు ఇటు నడుస్తూ గ్రౌండ్‌లో కనిపించింది. ప్రీ మ్యాచ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఫాతిమా సనాకు తన గాయం గురుంచి విలేకరులు ప్రశ్నించారు. అది అనుకోకుండా జరిగిన సంఘటన మాత్రమేని, తన సహచర ప్లేయర్ ఆయేషా ఆడిన షాట్ మోకాలికి తగిలిందని తెలిపింది. కొంచెం నొప్పి తగ్గిందని, మ్యాచ్ ప్రారంభమయ్యే సరికి పూర్తిగా కోలుకుంటా నని ఆశిస్తున్నానట్లు ఫాతిమా పేర్కొంది. ఒకవేళ భారత్‌తో మ్యాచ్‌కు ఫాతిమా దూరమైతే... ఆమె స్థానంలో వికెట్ కీపర్ మునీబా అలీ జట్టును నడిపించే అవకాశం ఉందని క్రికెట్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.



# ఇకపై 'రష్మిక మందన్న దేవరకొండ'



అత్తగారి ఊరిలో సర్‌ప్రైజ్ ఇచ్చిన రష్మిక! రష్మిక మందన్న కాదు.. ఇకపై 'రష్మిక మందన్న దేవరకొండ'.. అత్తగారి ఊరిలో సర్‌ప్రైజ్ ఇచ్చిన రష్మిక! రష్మిక మందన్న కాదు.. టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల అభిమానులకు సరికొత్త సర్‌ప్రైజ్ లభించింది. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉండి, ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంతో ఒకటైన ఈ జంటకు సంబంధించి ఒక ఆసక్తికర వార్త నెట్టింట వైరల్‌గా మారింది. సాధారణంగా హీరోయిన్లు పెళ్లి తర్వాత భర్త పేరునో లేదా వారి ఇంటిపేరునో తమ పేరు పక్కన చేర్చుకోవడం చూస్తుంటాం. అయితే, వివాహం తర్వాత కూడా రష్మిక తన సోషల్ మీడియా ఖాతాల్లో పాత పేరునే కొనసాగించడంతో, ఆమె పేరు మార్చుకోరని అందరూ భావించారు. కానీ, తాజాగా రష్మిక అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ భర్త ఇంటిపేరును తన పేరుకు జోడించి అఫీషియల్‌గా ప్రకటించారు. ఈరోజు విజయ్ దేవరకొండతో కలిసి రష్మిక తన అత్తగారి సొంతూరైన నాగర్‌కర్నూల్ జిల్లా తుమ్మన్‌పేట గ్రామాన్ని సందర్శించారు. అక్కడ 'ది దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 2026 విద్యా సంవత్సరానికి గానూ 9, 10వ తరగతుల్లో అత్యుత్తమ మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు (స్కాలర్‌షిప్స్) అందించే కార్యక్రమం జరిగింది. అయితే ఈ వేదికపై రష్మిక మాట్లాడుతూ తనను తాను మొదటిసారిగా 'రష్మిక మందన్న దేవరకొండ'గా పరిచయం చేసుకుని అక్కడి వారందరినీ ఆనందంలో ముంచెత్తారు. ఈ రోజు మీ ముందు ఇలా మాట్లాడటం చాలా సంతోషంగా ఉందన్న ఆమె, కష్టపడి మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఒకటైన ఈ జంటకు సంబంధించి ఒక ఆసక్తికర వార్త నెట్టింట వైరల్‌గా మారింది. సాధారణంగా హీరోయిన్లు పెళ్లి తర్వాత భర్త పేరునో లేదా వారి ఇంటిపేరునో తమ పేరు పక్కన చేర్చుకోవడం చూస్తుంటాం. అయితే, వివాహం తర్వాత కూడా మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు (స్కాలర్‌షిప్స్) అందించే కార్యక్రమం జరిగింది. అయితే ఈ వేదికపై రష్మిక మాట్లాడుతూ రష్మిక తన సోషల్ మీడియా ఖాతాల్లో పాత పేరునే కొనసాగించడంతో, ఆమె పేరు మార్చుకోరని అందరూ భావించారు. కానీ, తాజాగా రష్మిక అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ భర్త ఇంటిపేరును తన పేరుకు జోడించి అఫీషియల్‌గా ప్రకటించారు. ఈరోజు విజయ్ దేవరకొండతో కలిసి రష్మిక తన అత్తగారి సొంతూరైన జీవితంలో గెలుపోటములు సహజమని, ప్రతి అనుభవం నుండి పాఠాలు నేర్చుకుంటూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు హితవు పలికారు. బహిరంగ వేదికపై రష్మిక తన పేరును మార్చి పలకడం ఇదే తొలిసారి కావడంతో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# శ్రీలీల అరుదైన రత్నం నువ్వే



అరుదైన రత్నం నువ్వే శ్రీలీలపై మిహికా బజాజ్ ఎమోషనల్ పోస్ట్ వైరల్! టాలీవుడ్ యంగ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా మొత్తం శుభాకాంక్షలతో మార్మోగుతోంది. సినీ ప్రముఖులు, అభిమానులు, సన్నిహితులు ఆమెకు బర్త్‌డే విషెస్ చెబుతుండగా, హీరో రానా దగ్గుబాటి సతీమణి మిహికా బజాజ్ చేసిన ప్రత్యేక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. శ్రీలీలను తన "ఫేవరెట్ గర్ల్" అంటూ సంబోధించిన మిహికా, ఆమె వ్యక్తిత్వం, కష్టపడే తత్వం, మంచితనంపై ప్రశంసల వర్షం కురిపించారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో శ్రీలీలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మిహికా, ఆమెను కేవలం విజయవంతమైన నటిగానే కాకుండా గొప్ప మనసున్న వ్యక్తిగా అభివర్ణించారు. ప్రతి రోజూ నీ చుట్టూ ఉన్నవారికి నువ్వు స్ఫూర్తిగా నిలుస్తావు. నీ కష్టపడే తత్వం, పని పట్ల అంకితభావం అందరికీ తెలిసిన విషయమే. కానీ నీలోని దయ, కరుణ, నిస్వార్థమైన ప్రేమ నిన్ను మరింత ప్రత్యేకంగా నిలబెడతాయి అంటూ మిహికా భావోద్వేగంగా రాసుకొచ్చారు. అంతేకాకుండా శ్రీలీలను అరుదైన రత్నం గా అభివర్ణిస్తూ, ఆమె లాంటి వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారని పేర్కొన్నారు. శ్రీలీల ఎనర్జీ లెవెల్స్‌పై కూడా మిహికా ప్రశంసలు కురిపించారు. ఆమె నిరంతరం పనిచేసే తీరు, అలసట తెలియని ఉత్సాహం నిజంగా సూపర్ హ్యూమన్ కెపాసిటీలా ఉంటుందని అన్నారు.మేము నిన్ను చంద్రుడి వరకు ప్రేమించి మళ్లీ తిరిగి వచ్చేంతగా ప్రేమిస్తున్నాం" అంటూ తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, శ్రీలీల–మిహికాల మధ్య ఉన్న సన్నిహిత బంధంపై నెటిజన్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. కెరీర్ పరంగా చూస్తే ప్రస్తుతం శ్రీలీల సౌత్ ఇండియన్ సినీ పరిశ్రమలో అత్యంత బిజీ హీరోయిన్లలో ఒకరిగా కొనసాగుతున్నారు. టాలీవుడ్ యంగ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా మొత్తం శుభాకాంక్షలతో మార్మోగుతోంది. సినీ ప్రముఖులు, అభిమానులు, సన్నిహితులు ఆమెకు బర్త్‌డే విషెస్ చెబుతుండగా, హీరో రానా దగ్గుబాటి సతీమణి మిహికా బజాజ్ చేసిన ప్రత్యేక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. తన డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్, నటనతో తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ల జాబితాలో చోటు సంపాదించుకున్నారు. తెలుగులో వరుస భారీ చిత్రాలతో అలరించిన శ్రీలీల, ఇప్పుడు తమిళ చిత్రసీమలో కూడా అవకాశాలు అందుకుంటున్నారు. ప్రముఖ హీరో ధనుష్ సరసన తెరకెక్కుతున్న 'డి55' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తుండగా, 'పరాశక్తి' అనే మరో ప్రతిష్టాత్మక తమిళ ప్రాజెక్ట్‌లో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు.

# ఆర్జీవీ తదుపరి సినిమా ఇదేనా?




హైదరాబాద్‌లో ఇటీవల చోటుచేసుకున్న దారుణ హత్యలు, దోపిడీ ఘటనలు నగరవాసుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా ఇంటి పనిమనుషులుగా, సహాయకులుగా చేరి యజమానుల నమ్మకాన్ని సంపాదించిన తర్వాత దారుణాలకు పాల్పడుతున్న కొన్ని గ్యాంగ్‌ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. తాజాగా జూబ్లీహిల్స్‌లో జరిగిన ఒక సంచలన హత్యకేసు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపగా, ఈ ఘటన ఇప్పుడు సినీ పరిశ్రమ దృష్టినీ ఆకర్షిస్తున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఈ కేసుపై ఆసక్తి చూపుతున్నట్లు ఫిలింనగర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నగరాన్ని కుదిపేసిన ఈ క్రైమ్ ఘటన ఆధారంగా ఆయన ఒక రియలిస్టిక్ క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. వివరాల ప్రకారం, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే కుటుంబం జూబ్లీహిల్స్‌లో నివసిస్తోంది. ఆయన వైద్య చికిత్స నిమిత్తం బెంగళూరుకు వెళ్లిన సమయంలో ఇంట్లో భార్య తనూజ మరియు కుటుంబ సభ్యులు మాత్రమే ఉన్నారు. కుటుంబానికి సన్నిహితంగా, నమ్మకంగా పనిచేస్తున్న ఓ గృహ సహాయకురాలు ఈ పరిస్థితిని అవకాశంగా మార్చుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, ఆమె బయట ఉన్న కొందరితో కలిసి కుట్ర పన్ని అర్ధరాత్రి సమయంలో వారిని ఇంట్లోకి అనుమతించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి హత్య చేసి, నగదు మరియు విలువైన ఆభరణాలను దోచుకుని పరారైనట్లు అధికారులు గుర్తించారు. వివరాల ప్రకారం, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే కుటుంబం జూబ్లీహిల్స్‌లో నివసిస్తోంది. ఆయన వైద్య చికిత్స నిమిత్తం బెంగళూరుకు వెళ్లిన సమయంలో ఇంట్లో భార్య తనూజ మరియు కుటుంబ సభ్యులు మాత్రమే ఉన్నారు. కుటుంబానికి సన్నిహితంగా, నమ్మకంగా పనిచేస్తున్న ఓ గృహ సహాయకురాలు ఈ పరిస్థితిని అవకాశంగా మార్చుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, ఆమె బయట ఉన్న కొందరితో కలిసి కుట్ర పన్ని అర్ధరాత్రి సమయంలో వారిని ఇంట్లోకి అనుమతించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి హత్య చేసి, నగదు మరియు విలువైన ఆభరణాలను దోచుకుని పరారైనట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటన మరుసటి రోజు వెలుగులోకి రావడంతో నగరవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా నమ్మకమైన ఉద్యోగుల పేరుతో ఇళ్లలోకి చొరబడి నేరాలకు పాల్పడే ముఠాలపై ప్రజల్లో ఆందోళన మరింత పెరిగింది.అధికారి వినయ్ రంజన్ రే కుటుంబం జూబ్లీహిల్స్‌లో నివసిస్తోంది. ఆయన వైద్య చికిత్స నిమిత్తం బెంగళూరుకు వెళ్లిన సమయంలో ఇంట్లో భార్య తనూజ మరియు కుటుంబ సభ్యులు మాత్రమే ఉన్నారు. కుటుంబానికి సన్నిహితంగా, నమ్మకంగా పనిచేస్తున్న ఓ గృహ సహాయకురాలు ఈ పరిస్థితిని అవకాశంగా మార్చుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, ఆమె బయట ఉన్న కొందరితో వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమాలు రూపొందించడంలో ఆసక్తి చూపే వర్మ, ఈ కేసులోని కొన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నమ్మకాన్ని ఆయుధంగా మార్చుకోవడం, ముందస్తు ప్రణాళికలు, క్రైమ్ నెట్‌వర్క్‌ల కార్యకలాపాలు వంటి అంశాలు ఆయనను ఆకర్షించినట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా తన పాత స్థాయి సినిమాలు తీయలేకపోతున్నానని స్వయంగా అంగీకరించిన రామ్ గోపాల్ వర్మ, మళ్లీ బలమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు ఆయన తదుపరి ప్రాజెక్ట్‌కు స్ఫూర్తిగా మారే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది.

# మీనాక్షి చౌదరి పేరుతో సైబర్ మోసం



అభిమానులకు హీరోయిన్ కీలక హెచ్చరిక! టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదరి తాజాగా తన పేరుతో జరుగుతున్న సైబర్ మోసంపై స్పందిస్తూ అభిమానులను అప్రమత్తం చేశారు. సోషల్ మీడియా విస్తరణతో పాటు సెలబ్రిటీల పేర్లను, ఫోటోలను దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, తాజాగా మీనాక్షి కూడా అలాంటి ఒక ఫేక్ అకౌంట్ వ్యవహారానికి గురయ్యారు. కొంతమంది కేటుగాళ్లు మీనాక్షి చౌదరి పేరు, ఫోటోలు మరియు ఒక ఫోన్ నంబర్‌ను ఉపయోగించి ఇండస్ట్రీ వర్గాలు, అభిమానులు, సాధారణ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఈ విషయం హీరోయిన్ దృష్టికి రావడంతో వెంటనే సోషల్ మీడియా ద్వారా స్పందించారు. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఆ నకిలీ నంబర్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్లను షేర్ చేస్తూ కీలక హెచ్చరిక జారీ చేశారు. టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదరి తాజాగా తన పేరుతో జరుగుతున్న సైబర్ మోసంపై స్పందిస్తూ అభిమానులను అప్రమత్తం చేశారు. సోషల్ మీడియా విస్తరణతో పాటు సెలబ్రిటీల పేర్లను, ఫోటోలను దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, తాజాగా మీనాక్షి కూడా అలాంటి ఒక ఫేక్ అకౌంట్ వ్యవహారానికి గురయ్యారు. ఈ నంబర్ నుంచి ఎవరికైనా కాల్స్ లేదా మెసేజ్‌లు వస్తే దయచేసి నమ్మకండి. అది నా అధికారిక నంబర్ కాదు. వెంటనే ఆ నంబర్‌ను రిపోర్ట్ చేయండి అంటూ మీనాక్షి అభిమానులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చిన నెటిజన్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సెలబ్రిటీల పేర్లను ఉపయోగించి మోసాలు చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. 'ఫెమినా మిస్ ఇండియా 2018' రన్నరప్‌గా నిలిచిన మీనాక్షి చౌదరి, మోడలింగ్ రంగంలో గుర్తింపు తెచ్చుకున్న తర్వాత సినీ రంగంలోకి అడుగుపెట్టారు. 2021లో విడుదలైన 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తొలి సినిమాతోనే తన అందం, ఆకట్టుకున్నారు. అనంతరం అడివి శేష్ హీరోగా తెరకెక్కిన 'హిట్: ది సెకండ్ కేస్' చిత్రంలో నటించి కెరీర్‌లో తొలి భారీ విజయాన్ని అందుకున్నారు. ఈ సినిమా తర్వాత ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్న మీనాక్షి, మహేష్ బాబు నటించిన 'గుంటూరు కారం' చిత్రంలో కీలక పాత్రలో కనిపించిన మీనాక్షి, తీసుకెళ్లారు. సల్మాన్ సరసన నటించిన 'లక్కీ భాస్కర్' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేయడంతో పాటు ఆమె నటనకు ప్రశంసలు తెచ్చిపెట్టింది.

# నన్ను మించిపోయాడని గర్వంగా ఒప్పుకుంటా



చరణ్ నటనపై చిరంజీవి ఎమోషనల్ కామెంట్స్ సినిమా చూసిన అనంతరం మెగాస్టార్ చిరంజీవి చిత్రబృందాన్ని అభినందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటనపై ఆయన చేసిన ప్రశంసలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. సినిమా చూసిన అనంతరం మెగాస్టార్ చిరంజీవి చిత్రబృందాన్ని అభినందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటనపై ఆయన చేసిన ప్రశంసలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. చిరంజీవి మాట్లాడుతూ.. "ఈ సినిమాలో చరణ్ నటించలేదు.. పూర్తిగా ఆ పాత్రలో జీవించాడు" అని కొనియాడారు. ముఖ్యంగా భావోద్వేగ సన్నివేశాల్లో చరణ్ ప్రదర్శించిన నటన తనను ఎంతగానో కదిలించిందన్నారు.ముఖ్యంగా రామ్ చరణ్ నటనపై ఆయన స్క్రీన్‌పై కన్నీళ్లు పెట్టకుండా కేవలం కళ్లతోనే ప్రేక్షకుల హృదయాలను తాకి భావోద్వేగానికి గురిచేయడం గొప్ప నటుడి లక్షణం. పెద్ది పాత్రలో చరణ్ అదే చేసి చూపించాడు అని ప్రశంసించారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449